నేటి నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

కామారెడ్డి టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు మంగళవారం నుంచి ఈనెల 13 వరకు మూడు సెంటర్‌లలో నిర్వహించడం జరుగుతుందని డీఈవో రాజు తెలిపారు. బాన్సువాడలో 2, కామారెడ్డిలో ఒక సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 695మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష నిర్వహించబడునని తెలిపారు. పాఠశాల నుంచి హాల్ టికెట్స్ పొందలేని విద్యార్థులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. బీఎస్ఈ. తెలంగాణ. జీవోవి.ఇన్ అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.



కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణ చేస్తున్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రమేష్‌రెడ్డి



జిల్లా సమగ్ర అభివృద్ధిని వివరిస్తున్న రమేష్‌రెడ్డి

తెలంగాణ రైజింగ్ లక్ష్యంతో..

ప్రజా ప్రభుత్వం ముందుకు!

- ప్రతీ అర్హుడికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం
- వ్యవసాయ అభివృద్ధి - రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత
- ప్రతీ ఒక్కరికి పథకాలు అమలు అయ్యేలా అధికారులు కృషి చేయాలి
- భూ భారతితో భూవివాద రహిత మండలంగా లింగంపేట్
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రమేష్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

కామారెడ్డి/కామారెడ్డి టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో తాజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక, సామాజిక పాలన రంగాలలో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్- 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఇందులో నాలుగు కీలక అంశాలు ఉన్నాయి. పేదల సంక్షేమం, సమగ్రపాలసి రూపకల్పన, ప్రపంచ స్థాయి ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసి, గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఇన్‌ఫ్రా అండ్ ఇండస్ట్రీయల్ పాలసి, టూరిజం పాలసిలను ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం తెలంగాణ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్యఅతిధిగా రాష్ట్రపర్యటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. అంతకుముందు హౌజింగ్‌బోర్డు వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద పూలు వేసి అమరులకు నివాళ్లు అర్పించారు.

వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

రైతును రాజుగా చేయాలనే ఉద్దేశ్యంతో తొలిసారిగా రూ.2లక్షల వరకు ఒకేదఫాలో రైతులను ఋణవిముక్తులను రాష్ట్రప్రభుత్వం చేసిందని తెలిపారు. జిల్లాలో పంటలరుణ మాఫీ ద్వారా 1లక్ష1535 మంది రైతులకు రూ. 733 కోట్ల 22లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని, వ్యవసాయ అభివృద్ధిరైతుసంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తు రైతుభరోసా సహాయాన్ని ప్రతి సంవత్సరం ఎకరాకు రూ.12 వేలకు పెంచారని తెలిపారు.వ్యవసాయయోగ్యమైన అన్ని భూములకు ఈ సహాయాన్ని గత యాసంగి సీజన్ నుంచే కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ సీజన్‌లో 2.70లక్షల మంది రైతుల ఖాతాలో రూ.216 కోట్లు రైతు భరోసా నిధులు జమ చేసిందన్నారు. గడిచిన యాసంగిలో రైతులు పండించిన 3లక్షల 72వేల 965 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని 446 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలుచేసి, రూ.800 కోట్లు 71వేల 745 మంది రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగిందని అన్నారు.జిల్లాలో 79 వేల 970 మెట్రిక్ టన్నుల సన్నరకం వడ్లను 27వేల 795 మంది రైతుల నుండి కొనుగోలు చేసి 83కోట్ల రూపాయల బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. గడిచిన యాసంగి సీజన్‌లో మహిళలకు ఆర్థికంగా చేయూత ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఐకేపీ కేంద్రాలను 183కు పెంచామన్నారు. దీంతో మహిళ సంఘాలకు రూ.3.20 కోట్లు లబ్దిచేకురిందన్నారు. యాసంగిలో పండించిన జొన్నల కోసం 24 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి 30,202 మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోళ్లు చేశామన్నారు. రూ.102 కోట్లు చెల్లించామన్నారు. 653 మెట్రిక్ టన్నుల పొద్దుతిరుగుడు కొనుగోలుచేసి 5 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించామన్నారు.

ప్రజా సంక్షేమంపై దృష్టి

ప్రజా సంక్షేమంపై దృష్టిసారించి ఆయా పథకాలను ఒక్కొక్కటి అమలుచేసేందుకు ప్రభుత్వం పలు నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వం దగ్గరున్న వివరాల ఆధారంగా రేషన్‌కార్డులేని నిరుపేదలను గుర్తించి అర్హులైన నిరుపేదలందరికి కొత్తరేషన్‌కార్డుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మీ సేవ ద్వారా రేషన్‌కార్డులలో అదనపు కుటుంబసభ్యులనుచేర్చడానికి వచ్చిన దరఖాస్తులు గ్రామసభల ద్వారా ఆమోదించుకొని అదనపు కుటుంబసభ్యుల పేర్లను చేర్చుతున్నామని అన్నారు. ఇంతేకాకుండా ఏవరైన కొత్త దరఖాస్తులు ఇవ్వదలుచుకుంటే వీటిని కూడా స్వీకరించి పరిశీలన చేయబడుతాయని అన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 2లక్షల 56 వేల 732 రేషన్‌కార్డుల ద్వారా నెలకు 5 వేల 571 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలకు గాను 17 వేల 711 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేయడం

(మిగతా 6వ పేజీలో)



అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం



మహిళ పథకం శకటాన్ని పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు



స్టాళ్లను పరిశీలిస్తున్న దృశ్యం



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజలు

కాంట్రాక్ట్ ముగిసిందని పింఛన్ చెల్లింపుల నిలిపివేత

- వందల మంది వృద్ధ, వితంతు పింఛన్‌దారుల పడిగాపులు
- పింఛన్ కోసం దూరప్రాంతాల నుంచి వచ్చిన లబ్ధిదారులు



5

అన్నదాతపై సాగు భారం

- అకాల వర్షాలతో జిల్లాలో మొదలైన వేసవి దుక్కులు
- రోజురోజుకూ రెట్టింపు అవుతున్న ధరలు
- పెట్టుబడి వ్యయంతో ఆందోళనలో రైతులు



5

సాగుకు అందని సాయం

- వానాకాలం సీజన్ వస్తున్నా జమ కాని నిధులు
- చెల్లింపుల్లో తీవ్ర జాప్యంపై అన్నదాతల పెదవి విరుపు



5



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి

పశువులకు టీకాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామారెడ్డి టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో పశువులు లంపీ స్కిన్ వైరస్ భారిన పడడంతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మళ్లీ మొదలైన లంపీ స్కిన్ వైరస్' అనే కథనానికి జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారులు స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు 45వ వార్డులోని రామాలయం వద్ద ఉన్న ఆవులకు గర్గుల్ పశువైద్యాధికారి రవికిరణ్, సిబ్బంది దాదాపు 15 వరకు పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ గతంలో పలు పశువులకు లంపి స్కిన్ వైరస్ సోకడంతో ఎల్‌ఎస్‌డీ టీకాలు వేశామని తెలిపారు. వాటికి పుట్టిన పిల్లలు వైరస్ భారిన పడ్డాయని తెలిపారు. లంపి స్కిన్ భారిన పడుతున్న ప్రతీ పశువుకి టీకాలు వేశామని తెలిపారు. పశువులను పెంచుకునే యజమానులు వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఒక దాని నుంచి మరొక పశువుకు వైరస్ సోకుతున్నందున వాటిపై శ్రద్ధ వహించాలని సూచించారు. విచ్చలవిడిగా పశువులను రోడ్లపై విడిచిపెడితే వాటి వల్ల ఇతర పశువులకు సైతం వైరస్ సోకే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పిట్ల వేణుగోపాల్, సిబ్బంది రాజలింగం తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి

ఇంటర్మీడియట్ నూతన కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాజంపేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్మీడియట్ అప్‌గ్రేడ్ చేయడం జరిగిందని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి తెలిపారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ఫార్మాటెక్నాలజీ కోర్సులో 40 సీట్లు, ఆర్టిఫియల్ గార్మెంట్ టెక్నాలజీలో 40 సీట్లకు అడ్మిషన్‌లు జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 12 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఆటోను సీజ్‌చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్‌ఐ మహేష్ తెలిపారు. మండలంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సోమవార తెల్లవారుజామున మల్లయ్యపల్లి గ్రామశివారులో ఒక టాటాఏస్ వాహనం అను మానస్పదంగా కనిపించిందని తెలిపారు. ఆ టాటాఏస్ వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా 13 క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యం దొరికాయని, ఆ వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



పీడీఎస్ తరలిస్తున్న ఆటోను పట్టుకున్న దృశ్యం

పేకాట ఆడుతూ పట్టుబడిన నలుగురు వ్యక్తులు

ఎల్లారెడ్డిరూరల్,జూన్ 2(ఆంధ్రజ్యోతి):పేకాట ఆడుతూ పట్టుబడిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్‌ఐ మహేష్ తెలిపారు.మండల పరిధిలోని శివనగర్ గ్రామశివారులో ఎరుకల సాయిలు చేపల దుకాణం పక్కన నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి 5400 నగదు, 3 టీవీఎస్ ఎక్సెల్ వాహనాలు, 4 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసినట్లు తెలిపారు.

జూనియర్ కళాశాలకు హెచ్‌ఈసీ గ్రూపు మంజూరు

గాంధారి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హెచ్‌ఈసీ గ్రూప్ మంజూరైనట్లు కళాశాలప్రిన్సిపల్ గంగారాం తెలిపారు. గతంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని ప్రస్తుతం హెచ్‌ఈసీ గ్రూప్ సైతం మంజూరైందని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. గ్రూప్‌ను మంజూరుచేసిన ఇంటర్ బోర్డుకమీషనర్ కృష్ణ ఆదిత్య, ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాంకు కృతజ్ఞతలు తెలిపారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేందుకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో పారిశుధ్య కార్మికులతో కలిసి ప్రారంభోత్సవ ర్యాలీ నిర్వహించారు. జూన్ 2 నుంచి సెప్టెంబరు 10 వరకు ప్రత్యేక ప్రణాళికను ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతీ వార్డులో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తొలగిస్తు ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేయనున్నామని తెలిపారు. ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించి చెత్తరహిత కామారెడ్డిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ వేణుగోపాల్, ఏఈ శంకర్, ఆర్‌వో గోపాల్‌రెడ్డి, టీపీఓ గిరిధర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్‌లు నగేష్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని మండలాల్లో భూ భారతి అమలు

- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు
- 426 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహణ
- భూముల సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ
- ఇదివరకే పైలెట్ ప్రాజెక్ట్ లింగంపేటలో భూ సమస్యలకు ఆమోదం

కామారెడ్డి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం అమలుకు రెవెన్యూ యంత్రాంగ శ్రీకారం చుట్టబోతుంది. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించనుంది. భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. వీటితో పాటు గతంలో వచ్చిన సాదా బైనామాలకు పరిష్కారం చూపనున్నారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన లింగంపేట మండలంలో సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుంది. పలు దరఖాస్తులకు ఆమోదం తెలిపి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

20 వరకు సదస్సులు


జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మూడు రెవెన్యూ డివిజన్‌లు 25 మండలాల్లో 426 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. నేటి నుంచి ఈనెల 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాలలో షెడ్యుల్ ప్రకారం సదస్సులు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారు. ధరణి పోర్టల్‌లో పరిష్కారం కాని సమస్యలను ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. వాటి ఆధారంగా దరఖాస్తుల ఫారాలు కూడా సిద్ధం చేశారు. సమస్యలు ఉన్న రైతులకు సదస్సులో దరఖాస్తుఫారాలను అందజేశారు. భూయాజమానులు వాటిని పూర్తిచేసి అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. వాటితో పాటు పరిష్కారానికి నోచుకుని సమస్యలు ఉన్న దరఖాస్తులు స్వీకరిస్తారు.

తహసీల్దార్‌లకు లాగిన్

భూ భారతి చట్టం అమలులో భాగంగా ప్రభుత్వం తహసీల్దార్‌లకు సిటిజన్ లాగిన్ అవకాశం ఇచ్చింది. గతంలో మాదిరిగా ప్రతి చిన్న పనికి కలెక్టర్, సీసీఎల్ వరకు వెళ్లాల్సిన పనిలేదు. రెవెన్యూ సదస్సులు ముగిసిన అనంతరం భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తారు. అందులో తహసీల్దార్ పరిధిలో పరిష్కరించేందుకు వీలున్నవి, సాధ్యం కాని వాటిని వేరుచేస్తారు. పరిష్కారానికి వీలున్న దరఖాస్తులను తహసీల్దార్ పరిష్కరిస్తారు. అనంతరం తనకుఇచ్చిన సీటిజన్ లాగిన్‌లో అప్‌లోడ్ చేస్తారు.

భూ వివాద రహిత మండలంగా లింగంపేట

భూభారతి చట్టంలో భాగంగా ఇదివరకే పైలెట్ ప్రాజెక్ట్‌గా లింగంపేట మండలాన్ని ప్రభుత్వం ఎంపికచేసింది. ఈ మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై అధికారులు దరఖాస్తులుస్వీకరించారు. ఇలా 4,225 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు ఇతర శాఖల అధికారులతో విచారణ చేసి దరఖాస్తులను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. పరిష్కారానికి అనుకులంగా ఉన్న దరఖాస్తులకు ఆమోదం తెలిపారు. వాటిని వెనువెంటే పరిష్కరించే చర్యలు చేపడుతున్నారు. ఇలా లింగంపేట మండలాన్ని భూ వివాదరహిత మండలంగా మార్చనున్నట్లు అధికారులు చెబుతున్నారు.



రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు


బోధన్‌లో సబ్ కలెక్టర్ వికాస్ మహతో గౌరవ వందనం చేస్తున్న దృశ్యం


పసుపు పరిశోధన కేంద్రకార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న శాస్త్రవేత్త మహేందర్


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి


ఫుడ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న దృశ్యం

ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బోధన్‌రూరల్,జూన్2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం బోధన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విఠల్, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ అభివృద్ధి వైపు పరుగు పెడుతుందని ఆయన పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల సంక్షేమం కోసం అన్ని వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనే సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషామొయినోద్దీన్, మాజీ కౌన్సిలర్ దాము, మున్సిపల్ డీఈ యోగేష్, ఏఈ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు దాము, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషామొయినోద్దీన్, రుద్ర సత్యనారాయణ, విద్యాసాగర్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జెండా ఎగురవేసిన అనంతరం అంబేద్కర్ చౌరస్తా వరకు మున్సిపల్ సిబ్బంది ర్యాలీగా వెళ్లారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

● అమరుల త్యాగాలను ఏనాటి మరిచిపోవద్దు

అమరుల త్యాగాలను ఏనాటి మరిచిపోవద్దని సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ నాయకులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గల అమరవీరుల స్థూపాన్ని శుభ్రంగా కడిగి మాలార్పణ చేసి అమరవీరుల త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మారోజు సుధాకర్ చారి, పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్, మాజీ బీజేపీ కౌన్సిలర్ మానిని వినోద్, బోధన్ పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి రాజులదేవి పవన్ కుమార్, బీజేవైఎం అధ్యక్షులు గౌతం గౌడ్, బీవీఎస్ అధ్యక్షులు లింగం, సాగర్ గౌడ్, బాలు, కిషోర్, శివ పాల్గొన్నారు.

వర్ని:మండల వ్యాప్తంగా సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో జెండాలు ఎగురవేసి తెలంగాణ తల్లికి వందనాలు తెలిపారు. జై తెలంగాణ నినాదాలతో ప్రజలు, వివిధ పార్టీల నాయకులు సంబరాలు చేసుకున్నారు.

కోటగిరి: కోటగిరి, పొతంగల్ మండలాల్లో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గంగాధర్ జాతీయ జెండాను ఎగురవేశారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, మండల పరిషత్‌లో ఎంపీడీవో చందర్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సునీల్, రైతు వేదికలో ఏవో రాజు, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో శ్రీనివాస్ రావు, ఐకేపీలో ఏపీఎం బస్వంత్, విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ బుజ్జి బాబు, మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, సొసైటీలో విండో అధ్యక్షులు కూచి సిద్దు, కోటగిరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి చందర్ జాతీయ జెండాను ఎగురవేశారు.

నవీపేట: మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవీపేట సొసైటీ చైర్మన్ అబ్బన్న, వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, తెడ్డు పోశెట్టి, సూరి బాబు, లోకం నర్సయ్య, స్వామి, సతీష్ తదితరులున్నారు.

మోస్రా: చందూర్, మోస్రా మండల కేంద్రాలతో పాటు మండలాల్లోని గ్రామాల్లో, మండల కార్యాలయాల్లో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చందూర్,మోస్రా మండలాల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఆయా పార్టీనాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని అన్ని గ్రామాలలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రావణ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీవో వెంకటేష్, ఏపీఎం చిన్నయ్య, శ్రీనివాస్ రావు, డాక్టర్ వినయ్‌కుమార్ వారి కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ కార్యాయంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు వివిధ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ రాజు, కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జీ పి. శ్రీదేవి, ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బ్రహ్మానందం, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో రాజగంగారాం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకుడు లోక భూపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండ్ రవికుమార్‌లు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పతకాలను ఆవిష్కరించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ

పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో తెలంగాన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్ రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణగౌడ్; అబ్బల్ల తిరుపతి, వెంకట్‌రాం రెడ్డి, శశిధర్‌రెడ్డి, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్: ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం రాష్ట్ర అవతార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో గంగాధర్, వ్యవసాయ కార్యాలయంలో ఏవో రాంబాబు జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మిర్ధాపల్లిలోరక్తదాన శిబిరం:ఆలూర్ మండలం మిర్ధాపల్లిలో సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వివిధపార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

వేల్పూర్:మండల గ్రామాలలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాయం వద్ద చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వేల్పూర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జైడి నాగధర్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బాలకిషన్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సంజీవ్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావులు జాతీయజెండాలను ఎగురవేసి తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమాలలో బీఆర్ఎస్ నాయకులు నీరడి భాగ్యం,రాములు,డొల్ల రాజేశ్వర్‌రెడ్డి, రవీందర్,సత్యం,మహేష్,గంగాధర్‌గౌడ్, మోహన్‌దాస్,మహేందర్‌గౌడ్, రాము, నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్:తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సం సందర్భంగా సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ముంతాజిబుద్దీన్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రజినికాంత్, ఎంపిడీవో కార్యాలయంలో ఎంపిడీవో నరేష్ ఆనంద్, బిఆర్ఎస్ కార్యాలయం వద్ద ముస్కు భూమేశ్వర్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మగడి ముత్యం రెడ్డి, మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధలు, అధికారు పాల్గొన్నారు.

మెండోర: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో సంతోష్ రెడ్డి, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై యాసిర్ అర్పత్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వనజ, పోచంపాడ్ నీటి పారుదల శాఖ కార్యాలయం, జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఎస్ఈ శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే మండలంలోని మెండోర, కోడిచర్ల, సావెల్, వెల్కటూర్, సోన్‌పేట్,దూదిగాం,పోచంపాడ్,బుస్సాపూర్ గ్రామాల్లో సెక్రటరీలు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

జక్రాన్‌పల్లి:మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రజలు, వివిధ పార్టీల నాయకులు , అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో వివిధ పార్టీల నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రూరు: రుద్రూరు మండలంలోని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల సమీకృత భవనం వద్ద తహసీల్దార్ తారాబాయి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. దీంతో పాటు రుద్రూరు ఫుడ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాబాయి,. ఎంపీడీవో భీంరావ్, ఫుడ్ అండ్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ కల్పన, నాయకులు ఇందూరి చంద్రశేఖర్, పత్తి రాము, కార్తీక్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:కమ్మర్‌పల్లి మండలవ్యాప్తంగా సోమవారం తెంగాణ ఆవిర్భావదినోత్స వేడుకలు ఘనంగ జరిగాయి. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా అధికారులు జాతీయపతాకాన్ని ఎగురవేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి ప్రసాద్ జెండాను ఎగురువేయగా,ఎంపీడీవో రాజాశ్రీనివాస్‌పసుపు పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్త మహేందర్, మార్కెట్ కమిటీ కార్యాలయలంలో చైర్మన్ పాలెపు నర్సయ్య, కాంగ్రెస్, బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయాల్లో ఆయా పార్టీ అధ్యక్షుడు సుంకెటరవి, దేవేందర్ జాతీయ పతాకాలను ఎగుర వేశారు.

భీమ్‌గల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. భీమ్‌గల్ సీఐ సత్యనారాయణగౌడ్,తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్,మున్సిప్ కమిషనర్ గంగాధర్,కాంగ్రెస్‌పార్టీ,బీఆర్ఎస్‌పార్టీ నాయకులు తమ కార్యాలయాల్లో పాఠశాలలో హెచ్ఎం జాతీయ జెండాను ఎగురవేశారు.

ఏర్గట్ల: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మల్లయ్య, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాము, ఎంపిడీవో కార్యాలయంలో ఎంపిడీవో వెంకటేశ్వర్లు, బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, సొసైటీల్లో చైర్మన్‌లు పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, బర్మ చిన్న నర్సయ్య, మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధలు, అధికారు పాల్గొన్నారు.

పెర్కిట్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఆర్మూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ సత్యానారాయణ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఏటీవో రాములు, నాయబ్ తహసీల్దార్, ఆర్ఐ ప్రమోద్, తహసీల్దార్ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని పెర్కిట్ పాఠశాలలో, ఆదర్శ పాఠశాలలో తెలంగాణ ఆవిర్భావదినోత్సవం పురస్కరించుకొని జాతీయజెండాను ఎగురవేశారు.

ఎడపల్లి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు.ఎడపల్లి ఎంపీడీవోలో ఎంపీడీఓ శంకర్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దత్తాత్రి, గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, మండల ఐకేపీ కార్యాలయంలో మహిళ సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, ఎడపల్లి సొసైటీలో చైర్మన్ మల్కారెడ్డి,గ్రామాలలో కార్యదర్శులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


మెండోరలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ సంతోష్‌రెడ్డి


ఏర్గట్లలో జెండా ఎగురవేస్తున్న కాంగ్రెస్ నాయకులు


తహసీల్దార్ కార్యాలంయలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్


వేల్పూర్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి

యంచ చెక్‌పోస్టు తనిఖీ

నవీపేట,జూన్2(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ చెక్‌పోస్టును సోమవారం నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి పరిశీలించారు. రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని పొరుగున ఉన్న జిల్లా నుండి అక్రమంగా పశువులు తరలించకుండా చెక్‌పోస్టును ఏర్పాటు చేయడం జరిగింది. సంబంధిత చెక్‌పోస్టును పరిశీలించిన ఏసీపీ సిబ్బందికి తగిన సూచనలు అందజేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి,జూన్2(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కొడిచర్ల మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం రాత్రి తహసీల్దార్ గంగాధర్ పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు కొడిచర్ల చెక్‌పోస్టు వద్ద ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

నవీపేట,జూన్2(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్‌ఏరియాకు చెందిన పుట్టొళ్ల సాయిలు అనే ప్రైవేటు ఎలక్ట్రిషియన్ ఆదివారం విద్యుదాఘాతానికి గురయ్యాడని ఏఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానికంగా ఉన్న పెట్రోల్ బంక్‌లో కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో మేనేజర్ బాలకృష్ణ ప్రైవేటు ఎలక్ట్రిషియన్ సాయిలును వెంట తీసుకెళ్లాడని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజులు వేస్తుండగా 11కేవీ వైరు తగలడంతో విద్యుదాఘానికి గురై తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. వెంటనే 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని ఏఎస్ఐ తెలిపారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బినోలకు బస్సు ప్రారంభం

నవీపేట,జూన్2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోల గ్రామానికి సోమవారం ఆర్టీసీ అధికారులు బస్సు తిరిగి ప్రారంభించారు. గత కొన్ని రోజులుగా గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సోమవారం గ్రామానికి చెందిన పలువురు మహిళ సంఘాల సభ్యులు నిజామాబాద్-1 డిపోకు వెళ్లి తమ గ్రామానికి తిరిగి ఆర్టీసీ బస్సును ప్రారంభించాలని కోరారు. స్పందించిన అధికారులు బినోల గ్రామానికి బస్సును వేయడంతో అదే బస్సులో మహిళ సంఘాల సభ్యులు తమ స్వగ్రామానికి చేరుకున్నారు. తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు తిరిగి ప్రారంభించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

రెండో రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు


నవీపేటలో దీక్ష చేస్తున్న వారికి సంఘీభావం ప్రకటించిన బీజేపీ నాయకులు

నవీపేట,జూన్2(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో రెండో రోజైన సోమవారం పలువురు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని మండల బీజేపీ నాయకులు సందర్శించి తమ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, ఆనంద్, శ్రీకాంత్, రాజేందర్, గంగాధర్, రాధ తదితరులున్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం

బోధన్‌రూరల్,జూన్2(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కల్దుర్కి, రాంపూర్ తదితర గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10సంవత్సరాల ప్రజలకు చేసిందేమి లేదని, పది సంవత్సరాలు కాలయాపన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గణపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ప్రకాష్ పటేల్, గ్రామస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ పథకంలో భాగంగా లబ్ధిదారులకు సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు రాజేశ్వర్, మాణిక్యం, మండల కాంగ్రెస్ నాయకులు మందుల కిరణ్, ఎస్ గంగాధర్, సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు నీలం రవి, ఉపాధ్యక్షుడు బర్ల మోహన్, క్యాషియర్ హరీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రూరు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సోమవారం రుద్రూరు మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో భీంరావ్, రుద్రూరు పంచాయతీ ఈవో గంగాధర్, బాన్సువాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్, నాయకులు, తాజామాజీ జడ్పీటీసీ నారోజి గంగారాం, పత్తి లక్ష్మణ్, కార్తీక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, నికాల్ పాల్గొన్నారు

వేల్పూర్: అర్హులైన పేదలందరికి దశల వారిగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని వాడి గ్రామంలో అర్హులైన 7 గురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి రాజేశ్, కాం గ్రెస్ నాయకులు అంకం రమేష్, మహేందర్, అశోక్, శెట్టి వినోద్, సతీష్, కార్తీక్, వేణు, కాశం సాయిక్రిష్ణ, కారోబార్‌సుదర్శన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామంలో సోమవారం గ్రామ పంచాయతీలో తెలంగాణ ఆవిర్భావ దినోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి అర్హులైన లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్‌లు ప్రొసిడింగ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దిబ్బ శ్రీనివాస్, బెజ్జారం శ్రీను, ఆవుల దేవన్న, బెజ్జారం భాను, తుమ్మల ప్రభాకర్, కార్యదర్శి బోజన్నలు పాల్గొన్నారు.

రెంజల్: ప్రభుత్వం గూడు లేని నిరుపేదలకు పక్కా ఇళ్లను కట్టించాలన్న ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్లను అర్హులను గుర్తించి అందజేయడం జరిగిందని ఎంపీడీవో వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంవడల అధ్యక్షులు మొబిన్ కాన్, సాయిరెడ్డి, రవి, ఖుద్దుస్, సాయిరెడ్డి, రామాలయ చైర్మన్ శ్రీనివాస్, యోగేష్, అంజాగౌడ్, లక్ష్మణ్, పోశెట్టి, ఎంపీవో రఫీ, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, కారోబార్ అనంత్ రావు, అమ్జద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్ని:మండల కేంద్రం పరిధిలోని అంతాపూర్ తండాలో సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మ, తహసీల్దార్ సాయిలు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, వైస్ చైర్మన్ గోపాల్, విండో చైర్మన్ సాయిబాబా, భారీ పాల్గొన్నారు.



లబ్ధిధారులకు ప్రొసిడింగ్‌లు అందజేస్తున్న నాయకులు

భూవివాదంలో ఒకరిపై దాడి..!



డోమకొండ,జూన్ 2(ఆంధ్ర జ్యోతి) : డోమకొండ మండలం ముత్యంపేట శివారులో భూ సమస్యపై సోమవారం సర్వే చేస్తుండగా రమేష్ అనే వ్యక్తిపై శ్రీనివాస్ దాడికి పాల్పడడంతో తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యంపేట శివారులోని 611 సర్వేనంబర్‌లో 10 ఎకరాల భూమి ఉంది. ఇందులో 5 ఎకరాలలో గతంలో రైస్‌మిల్ ఏర్పాటుచేయగా ఆ భూమికి సంబంధించి రమేష్ తన పార్టనర్స్‌తో కలిసి కొనుగోలుచేశాడు. ఈ భూమికి సంబంధించి హద్దులు చూపించాలని ప్రభుత్వ సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకోగా సర్వే అధికారులు మంగళవారం వచ్చి సర్వే చేస్తుండగా ఎలాంటి సంబంధం లేని శ్రీనివాస్ అనే వ్యక్తి అడ్డుకున్నాడు. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా శ్రీనివాస్ రమేష్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో రమేష్‌తలపై తీవ్రగాయం కావ డంతో సహచరులు వెనువెంటే డోమకొండఆసుపత్రికి తరలించారు.ఈ భూవివాదంలో శ్రీని వాస్ గత కొన్నిరోజులుగా తమను వేధిస్తున్నాడంటూ డోమకొండ ఎస్ఐ, భిక్కనూరు సీఐలకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని శ్రీని వాస్‌కే సహకరిస్తున్నారంటూ బాధితుడు ఆరోపించాడు.ఈఘటనపై రమేష్‌తో పాటు ఆయన సహచరులు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రకు ఫిర్యాదు చేశా రు. శ్రీనివాస్ మండలంలో అధికారపార్టీకి చెందిన నాయ కుడు కావ డంతో పోలీసులుచర్యలు తీసుకోవడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

మొబైల్ వాడొద్దన్నందుకు బాలిక ఆత్మహత్య


నందిని(ఫైల్)

లింగంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రం లోని మత్తడికింది పల్లెకు చెందిన బొంత నందిని(16) మొబైల్ వాడ వద్దని తల్లిదండ్రులు చెప్పినందుకు కుంటలో దూకి ఆత్మహత్య చేసున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం రాత్రి తల్లి శెణవ్వ, తండ్రి పోచయ్యలతో కలిసి భోజనం చేసిన నందిని అందరు పడుకున్న తరువాత ఇంటికి గడియ పెట్టి వెళ్లి మండల కేంద్రంలోని చీరపేన్ల కుంటలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రొబేషనరీ ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. సోమవారం ఉదయం వెతకగా కుంటలో శవం తేలడంతో తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తు న్నట్లు ఎస్సై తెలిపారు.

యంచలో బస్సు ఆపకపోవడంతో స్థానికుల ఆగ్రహం

నవీపేట,జూన్2(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచలో సోమవారం ఆర్టీసీ ఆర్డీనరీ అద్దె బస్సు ఆపకపోవడంతో పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ డిపో1కు చెందిన ఆర్టీసీ బస్సు బాసర నుండి నిజామాబాద్ వెళ్తుంది. బస్సులో 15మంది ప్రయాణికులు ఉన్నారు. యంచలో బస్టాండ్‌లో డ్రైవర్ బస్సును ఆపకపోగా కొద్ది దూరంలో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద బస్సు స్లో అయింది. వెంటనే అక్కడే ఉన్న మాజీ సర్పంచ్ లహరితో పాటు ఆమె కుమార్తె బస్సులో ఎక్కారు. వెనుక నుండి మరికొంతమంది ప్రయాణికులు బస్సును ఆపాలని గట్టిగా కేకలు వేయగా ఈ విషయం గమనించని డ్రైవర్ శ్రీధర్ బస్సును ముందుకు పోనిచ్చాడు. దీంతో అక్కడే ఉన్న మాజీ సర్పంచ్ లహరి భర్త ప్రవీణ్ కుమార్ తన బైక్‌ను ముందుకు పోనిచ్చి బస్సుకు అడ్డుగా పెట్టాడు. ఈ సమయంలో డ్రైవర్ శ్రీధర్, ప్రవీణ్ కుమార్‌ల మధ్యన గొడవ జరిగింది. తమపై దాడి చేసి గాయపర్చారని ఇరువురు నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎస్ఐ సందీప్‌ను వివరణ కోరగా విచారణ జరుపుతున్నామని అన్నారు.

ఆర్మూర్‌లో నూతన గ్రంథాలయం ఏర్పాటు చేస్తాం

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి


జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను సన్మానిస్తున్న యువకులు

ఆర్మూర్ రూరల్ , జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ లో నూతన గ్రంథాలయం ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి అన్నారు. సోమవారం ఆలూర్ మండల కేంద్రాన్ని ఆయన సందర్శించారు.గ్రామస్థుల కోరిక మేరకు స్పందించిన చైర్మన్ గ్రంథాలయ ఏర్పాటుకు రూ. 40 లక్షలతో నూతన భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. అనం తరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, నిజాంసాగర్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ యాల్లా సాయిరెడ్డిని గ్రామ యువకులు సన్మానిం చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్, కల్లెం మోహన్, మర్కంటి మల్లేష్, దుమ్మాజి శ్రీనివాస్, సంజీవ్, భాస్కర్, చిరంజీవి, యోగేష్‌గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

రుద్రూరు,జూన్2(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 3వ తేది నుండి 10వతేది వరకు రుద్రూరు మండల కేంద్రంలోని ఆయా గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తారాబాయి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బాల్కొండ: మండలం పరిధిలోని రేపటి నుండి నిర్వహించే రెవెన్యూ సదస్సులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాల్కొండ తహసీల్దార్ ఆడపా శ్రీధర్ కోరారు. ఈనెల 3న జలాల్‌పూర్, 4న కిసాన్‌నగర్, 5న వన్నెల్ బి, 6న బోదెపల్లి, 9న చిట్టాపూర్, 10న బాల్కొండ, 11న నాగపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిచనున్నట్లు పేర్కొన్నారు.

ఎడపల్లి: రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 3వ తేది నుండి 10వతేది వరకు ఎడపల్లి మండల కేంద్రంలోని ఆయా గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దత్తాత్రి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఏర్గట్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో నేటి నుండి 11 వ వ తేది వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మల్లయ్య ఓ ప్రకటన లో తెలిపారు. అందులో భాగంగా నేడు తాళ్ళరాంపూర్, 4న బట్టాపూర్, 5న తడపాకల్, 6న గుమ్మిర్యాల్, 9న దోంచంద, 10న తొర్తి, 11న ఏర్గట్లలో ఈ సదస్సులు నిర్వహిస్తామని, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు రైతులు తమ సమస్యల గురించి దరఖాస్తులు ఇవ్వాలని కోరారు.

కోటగిరి: కోటగిరి, పొతంగల్ మండలాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి మండలాల తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. కోటగిరి మండలంలో 3వ తేదిన యాద్గార్‌పూర్, 4వ తేదిన వల్లభాపూర్, 5వ తేదిన ఎత్తొండ, 6వ తేదిన రాంపూర్, 9న సుద్దులం, 10న గన్నారం, 11న లింగాపూర్, 12న అడ్కాస్‌పల్లి, 13న బస్వాపూర్, 14న కొత్తపల్లి, 16న ఎక్లాస్‌పూర్, 17, 18, 19, 20, కోటగిరిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పొతంగల్ మండలంలో 3న జల్లాపల్లి ఫారం, 4న కల్లూర్, 5న కొడిచర్ల, 6న సుంకిని, 9న కొల్లూర్, 10న హంగర్గ, 11న సొంపూర్, 12న టాక్లీ, 13న దోమలెడ్గి, 14న తిర్మలాపూర్, 16న కారేగాం, 17న హెగ్డోలి, 18, 19, 20వ తేదిల్లో పొతంగల్‌లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయన్నారు.

నవీపేట: భూభారతి 3వ ఫేజ్ రెవెన్యూ సదస్సులను మంగళవారం నుండి ఈ నెల 20వరకు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ వెంకట రమణ తెలిపారు. ఈ నెల 3న యంచ, అనంతగిరి, 4న నందిగామ, అల్జాపూర్, అబ్బాపూర్(ఎం), 5న పొతంగల్, ధర్మారం, 6న జన్నేపల్లి, అభంగపట్నం, 9న నాడాపూర్, మహంతం, 10న సిరన్‌పల్లి, మోకన్‌పల్లి, 11న లింగాపూర్, కమలాపూర్, 12న శాఖాపూర్‌తో జరుగుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు.


కొవిడ్ కేర్

తిరగబెట్టిన కొవిడ్ కథ

కొవిడ్ కథ ముగిసిందని సంబరపడేలోపే కొత్త వేరియెంట్స్ పుట్టుకొచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో కొవిడ్ కేసులు ఊపందుకుంటున్న నేపథ్యంలో, తాజా కొవిడ్ వేరియెంట్లు, వాటి ప్రభావాల గురించి తెలుసుకుందాం!

వ్యాక్సిన్లు, బూస్టర్లతో కొవిడ్ రక్షణ పొందినప్పటికీ, ఆరోగ్య భద్రతా చర్యలు పటిష్ఠంగా పాటిస్తున్నప్పటికీ, కొత్త కొవిడ్ లక్షణాల మీద ఓ కన్నేసి ఉంచడం అత్యవసరం. ఇప్పటివరకూ మన దేశంలో రెండు రకాల కొత్త వేరియెంట్లు వెలుగులోకొచ్చాయి. అవేంటంటే...

- **ఎన్‌బి.1.8.1:** ఢిల్లీ, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో విస్తృతంగా కనిపిస్తున్న వేరియెంట్ ఇది. ఒమైక్రాన్‌తో సన్నిహిత సంబంధం కలిగిన ఈ వేరియెంట్, స్పైక్ ప్రొటీన్‌పరంగా స్వల్ప ఉత్పరివర్తనాలను కలిగి ఉంది. తేలికపాటి లక్షణాలతో బయల్పడుతున్న ఈ వైరస్, వ్యాక్సిన్ తీసుకోని పెద్దల్లో వేగంగా విస్తరిస్తోంది



- **ఎల్‌ఎఫ్.7:** ఈ వైరస్ దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో బయల్పడింది. 2022కు ముందు కొవిడ్-19 బారిన పడిన పెద్దల వ్యాధినిరోధకశక్తికి, ఈ వైరస్ ఎక్కువ నిరోధకతను కలిగి ఉండవచ్చని అధ్యయనాలు చెప్తున్నాయి.

అయితే ప్రస్తుతానికి ఈ రెండు వేరియెంట్లలో ఏ ఒక్కదాన్నీ ఆందోళనకరమైన వేరియెంటుగా వర్గీకరించడం జరగలేదని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. కాబట్టి వ్యాక్సిన్లు తీసుకున్న వారిని ఈ వేరియెంట్లు తీవ్ర అస్వస్థతకు గురి చేయలేవు. అయితే గొంతు నొప్పి, పొడి దగ్గు, నీరసం ఈ కొత్త వేరియెంట్ల ప్రధాన లక్షణాలు అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. రుచి, వాసన కోల్పోవడం, లాంటి కొవిడ్ సంప్రదాయ లక్షణాలేవీ లేకుండానే ప్రస్తుతం పాజిటివ్ ఫలితాలు వెలువడుతున్నాయి. వీటికి బదులుగా అలర్జీ, సాధారణ జలుబును తలపించే లక్షణాల రూపంలోనే తాజా కొవిడ్ వేరియెంట్లు బయల్పడుతున్నాయి.

వీటి మీద కన్నేసి...

- జ్వరం, లేదా చలి
- ముక్కు దిబ్బెడ, ముక్కు నుంచి నీరు కారడం
- గొంతు నొప్పి
- పొడి దగ్గు
- తలనొప్పి, నీరసం
- జీర్ణసంబంధ సమస్యలు (డయేరియా)
- ఒంటి నొప్పులు

ఈ లక్షణాలు కనిపిస్తే?

- ఇంటి పట్టునే శరీర ఉష్ణోగ్రత, ఆక్సిజన్ మోతాదులను పరీక్షించుకోవాలి
- బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఇంటికే పరిమితమైపోవాలి
- ఆర్‌టి-పిసిఆర్ లేదా యాంటిజెన్ పరీక్షలు చేయించుకోవాలి
- 3 నుంచి 4 రోజుల్లో లక్షణాలు అదుపులోకి రాకపోతే వైద్యులను కలవాలి

ఆయుర్వేదం



వానాకాలం జలుబు, దగ్గు, జ్వరాలు సహజమే! అయితే వీటన్నిటి మూల కారణం జీర్ణ వ్యవస్థలో ఉంటుందని ఆయుర్వేదం చెప్తోంది. ఈ కాలంలో కుంటుపడే జీర్ణవ్యవస్థ, రోగనిరోధక వ్యవస్థలను ఎలా దార్లోకి తెచ్చుకోవాలో తెలుసుకుందాం!

వానాకాలం వెతలకు చెక్

వానాకాలంలో శరీరంలో వాతం, పిత్తం పెరుగుతాయి. ఆదాన కాలమైన వేసవిలో కుంటుపడే జీర్ణశక్తి, వానాకాలంలో మరికాస్త దిగజారుతుంది. దాంతో అరుగుదల మందగిస్తుంది. ఫలితంగా పేగుల్లోని మంచి బ్యాక్టీరియా క్షీణించి, రోగనిరోధకశక్తి కూడా సన్నగిల్లుతుంది. దీనికి తోడు వానాకాలంలో వ్యాధికారక సూక్ష్మక్రిములు విజృంభించడం, కలుషిత ఆహారం, నీటి వల్ల సులభంగా వ్యాధుల బారిన పడుతూ ఉంటాం.



అయితే దగ్గు, జలుబులు, జ్వరాలు చలికాలంలో కూడా వేధిస్తాయి. కానీ వాటికి ప్రధానంగా గాల్లో విస్తరించి ఉండే వ్యాధికారక సూక్ష్మక్రిములు పొడిబారిన శ్వాసకోశ వ్యవస్థలోకి సులువుగా చొరబడి ఇబ్బంది పెట్టడమే కారణం. కానీ వానాకాలపు జలుబు, దగ్గు, జ్వరాలకు మాత్రం సన్నగిల్లిన వ్యాధినిరోధకశక్తే ప్రధాన కారణమవుతూ ఉంటుంది. కాబట్టి ఈ కాలంలో తలెత్తే అసౌకర్యాలకు కారణాన్ని బట్టి చికిత్సను అందించాల్సి ఉంటుంది.

త్రికటుతో తరిమికొట్టి...

త్రికటువులైన శొంఠి, మిరియాలు, పిప్పళ్లు ఈ కాలంలో తీసుకుంటూ ఉండాలి. ఈ పొడిని పండ్ల మీద చల్లుకుని తినొచ్చు. లేదా నేరుగా తినొచ్చు. గోరువెచ్చని నీళ్లలో కలుపుకుని తాగొచ్చు. దీంతో జీర్ణశక్తి పెరగడంతో పాటు శ్వాసకోశ వ్యవస్థ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా రక్షణ కూడా దొరుకుతుంది. కాబట్టి రోజుకు పావు టీస్పూను చొప్పున త్రికటు తీసుకోవచ్చు. ఇదే కాకుండా తాలిసాది చూర్ణం, సీతోపలాది చూర్ణాలు కూడా వానాకాలపు అనారోగ్యాల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. జలుబు వచ్చినా, రాబోతున్నట్టు అనిపించినా త్రికటు, లేదా సీతాఫలాది లేదా తాలిసాది చూర్ణాల్లో ఏదో ఒక దాన్ని తీసుకోవచ్చు. పెద్దలు ఉదయం, సాయంత్రం ఒక చెంచా చూర్ణాన్ని తేనెతో లేదా గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవాలి. తేనె స్వచ్ఛంగా ఉండాలి.

జలుబు, దగ్గు, జ్వరం

జ్వరాన్ని తగ్గించడం కోసం 'షడంగ పానీయం' తీసుకోవచ్చు. అర చెంచా పొడిని రెండు గ్లాసుల నీళ్లలో కలిపి, ముప్పావు వంతుకు మరిగించి, వడగట్టి రెండు పూటలా తీసుకోవాలి. జలుబుకు 'వ్యోషాది వటి' ఉపయోగపడుతుంది. ఉదయం, రాత్రి రెండు మాత్రల చొప్పున తీసుకోవాలి. రెండేళ్ల లోపు పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరాలను తగ్గించడం కోసం 'కస్తూరి' మాత్రలు అందించాలి. ఒకటి లేదా రెండు మాత్రలను దంచి తల్లిపాలలో లేదా మరిగించి చల్లార్చిన నీళ్లలో రంగరించి పిల్లలకు పట్టించవచ్చు. 'వాయు గుళిక' జలుబుకు సమర్థమైన ఔషధం. ఈ గుళికను మూడు పూటలా తీసుకోవాలి. నవజ్వరానికి (ప్రారంభంలో ఉన్న జ్వరం) శొంఠి, అల్లపు రసం, మిరియాలు, తేనె కలిపి చెంచా చొప్పున మూడు పూటలూ ఇవ్వాలి. పొట్టలో సమస్యలకు, నీళ్ల విరోచనాలకు 'కుటజ ఘనవటి' మూడు పూటలా రెండు మాత్రల చొప్పున తీసుకోవాలి. పిల్లలకు అర మాత్ర సరిపోతుంది. ద్రవరూపంలోని కుటజారిష్ట అయితే, పెద్దలు, 15 మిల్లీ లీటర్ల చొప్పున మూడు పూటలా తీసుకోవాలి. నులిపురుగుల సమస్యలు కూడా ఈ కాలంలో ఎక్కువే! దీని కోసం ద్రవరూపంలోని 'విడంగారిష్ట'ను 15 మిల్లీలీటర్ల చొప్పున మూడు పూటలా తీసుకోవాలి. పిల్లలకు 10 మిల్లీలీటర్లు సరిపోతుంది.

తినవలసినవి - తినకూడనివి

ఈ కాలంలోని ఆరోగ్య సమస్యలకు సన్నగిల్లిన వ్యాధినిరోధకశక్తి ప్రధాన కారణం కాబట్టి అందుకు కారణమైన జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడం మీదే ధ్యాస పెట్టాలి. అందుకోసం జీర్ణ సంబంధ సమస్యలను నియంత్రించుకోవాలి. కొన్ని పదార్థాలను తినడం మానుకోవాలి. కొన్నిటిని తప్పనిసరిగా తింటూ ఉండాలి.

- **తినకూడనివి:** పచ్చి కూరగాయలు, పండ్లను శుభ్రంగా కడిగి తినాలి. మొక్కజొన్నను ఉడికించకుండా, కాల్చి తినాలి. సజ్జలు, మార్కెట్లో దొరికే పాలకూర తినకూడదు. ఇంట్లో పండించిన పాలకూర తినొచ్చు. అలాగే కాకరకాయ, క్యాబేజీ, బంగాళాదుంపలు, క్యారెట్ తినకూడదు. కఫాన్ని పెంచే చేపలు తగ్గించాలి. ఆవు పాలు తీసుకోవచ్చు. గేదె పాలు మానేయాలి. కఫాన్ని పెంచే తీపి పదార్థాలు, వెన్న, జున్ను తీసుకోకూడదు. అలాగే చల్లదనాన్ని అందించే కీర, పుచ్చ ఈ కాలంలో పనికి రాదు. మజ్జిగను నేరుగా తీసుకోకుండా మజ్జిగపులుసు రూపంలో తీసుకోవచ్చు.
- **తినదగినవి:** బెండ, పెసరపప్పు, మినపప్పు, ఉల్లి, వెల్లుల్లి తీసుకోవచ్చు. ఉల్లి, వెల్లుల్లిలో నీటిలో కరిగే పీచు ఉంటుంది. ఇది పేగులకు మంచిది కాబట్టి వీటిని ఈ కాలంలో తప్పనిసరిగా తీసుకోవాలి. దుంపల్లో కంద తినొచ్చు. ద్రాక్ష పండ్ల మీద తెల్లని పొర ఉంటుంది. ఇది అందరూ అనుకుంటున్నట్టు పురుగుమందులతో ఏర్పడిన పొర కాదు. అది ఆరోగ్యానికి మేలుకరమైన బ్యాక్టీరియా పొర. కాబట్టి ద్రాక్షను కడిగినా, ఈ తెల్లని పొర తొలగిపోకుండా చూసుకోవాలి. మామిడి, నిమ్మ పండ్లు తీసుకోవచ్చు. ఈ కాలంలో కొత్తిమీర, పుదీనా కూడా తీసుకోవాలి.

డాక్టర్ డి.వి. ప్రశాంత్ కుమార్
పంచకర్మ స్పెషలిస్ట్, శక్తి ఆయుర్వేదిక్ క్లినిక్, ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్.



డిజిటల్ స్క్రీన్స్ మన జీవితంలో భాగాలైపోయాయి. గంటల తరబడి కళ్లను తెరలకు అప్పగించకపోతే రోజు గడవని పరిస్థితి. అయితే ఈ జీవనశైలితో కళ్లకు కీడు కలుగుతోందా? వైద్యులేమంటున్నారు?

కంటి ఆరోగ్యం





తెరలతో తంటా

కళ్లు పొడిబారడం, కళ్ల మంటలు, ఎరుపెక్కడం, నీరు కారడం, కనుబొమల నొప్పులు... ఇవన్నీ డిజిటల్ స్క్రీన్స్ వాడకంలో మనం చేసే పొరపాట్లకు సంకేతాలు. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టివిలు మన జీవితంలో భాగాలైపోయినప్పుడు, వాటిని వినియోగించుకుంటూనే కళ్లు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు కూడా పాటిస్తూ ఉండాలి. ఏ స్క్రీన్ ఎంత దూరంలో ఉండాలి? వాటిని ఎంత సమయం పాటు చూడాలి? ఎంత వ్యవధికి బ్రేక్ తీసుకోవాలి? కళ్లు అలసటకు లోను కాకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? అన్నది కూడా తెలుసుకోవాలి.

నీలి కిరణాలను వడగట్టి...

పుస్తకం చదివేటప్పుడు కళ్లకు ఎంత దూరంగా ఉంచుకుని చదువుతామో, మొబైల్ ఫోన్లను కూడా అంతే దూరంలో ఉంచి వాడుకోవాలి. అయితే ఇటీవలి కాలంలో పిల్లలు సెల్‌ఫోన్లకు ఎక్కువగా అలవాటు పడిపోతున్న సందర్భాలు పెరుగుతున్నాయి. నిజానికి ఆరేళ్ల వరకూ పిల్లల కనుగుడ్లు అభివృద్ధి దశలోనే ఉంటాయి. కాబట్టి ఈలోగా అతిగా మొబైల్ ఫోన్లకు అలవాటు పడడం వల్ల పిల్లల్లో మెల్లకన్ను తలెత్తుతుంది. పెద్దలైనా అదే పనిగా రెండు గంటలకు మించి సెల్‌ఫోన్ వాడడం కళ్లకు హానికరం. ఆ రెండు గంటల్లో ప్రతి అరగంటకూ విరామం తీసుకోవాలి. పిల్లల విషయానికొస్తే, రోజు మొత్తంలో, బడిలో, ఇంట్లో కలిపి, రెండు గంటలకు మించి స్క్రీన్స్ చూడకూడదు. ఈ రెండు గంటల్లో ప్రతి 20 నిమిషాలకూ బ్రేక్ ఇవ్వాలి. పిల్లలకు సెల్‌ఫోన్స్ ఇచ్చేటప్పుడు, అలారం, స్క్రీన్ కంట్రోల్ టైమ్ సెట్ చేసి ఇవ్వడం మంచిది. వీటితో పిల్లల సెల్‌ఫోన్ వాడకాన్ని పరిమితం చేయవచ్చు. గేమ్స్ ఆడేటప్పుడు పిల్లలు మొబైల్‌ఫోన్‌ను కళ్లకు మరీ దగ్గరకు తీసుకొచ్చేస్తూ ఉంటారు. దీంతో కళ్లలో మైనస్ పవర్ పెరుగుతుంది. కాబట్టి ఈ విషయంలో పెద్దలు పిల్లలను కట్టడి చేయాలి. మరీ ముఖ్యంగా డిజిటల్ స్క్రీన్స్ నుంచి వెలువడే నీలి కిరణాల వల్ల కంటికి హాని కలుగుతుంది. కాబట్టి ఆ కిరణాలను అడ్డుకునే ఫిల్టర్లను ఫోన్లు, డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్స్‌లో ఉపయోగించాలి. కళ్లజోడు అలవాటున్న వాళ్లు ఆ కిరణాలను అడ్డుకునే పూత కలిగిన జోళ్లను వాడుకోవాలి. అలాగే టివిలకు కనీసం 20 అడుగుల దూరం పాటించాలి. సాధారణ వెలుగులోనే టివి చూడాలి తప్ప, కిటికీలు, తలుపులు మూసేసి, లైట్లు ఆర్పేసి చీకట్లో టివి చూడడం సరి కాదు.

ఇలాంటప్పుడు అప్రమత్తం కావాలి

- స్క్రీన్ చూస్తున్న అరగంటకే కళ్లు మసకబారుతున్నా...
- ఒకటికి రెండు చిత్రాలు కనిపిస్తున్నా...
- కళ్లు ఎర్రబడి, నీళ్లు కారుతున్నా...
- పిల్లల్లో మెల్లకన్ను మొదలైనా...
- పిల్లలు తెరను చూడడం మొదలుపెట్టిన అరగంటకే తలనొప్పి మొదలైనా...
- పిల్లలు రాయడానికి ఇబ్బంది పడుతున్నా...
- పెద్దలు ఫాంట్ సైజు పెంచవలసిన అవసరం పడుతున్నా...

20-20-20 నియమం

ప్రతి 20 నిమిషాలకూ 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును చూడవలసిన నియమమిది. దగ్గర్లో ఉన్న తెరలను చూస్తున్నప్పుడు కళ్లలోని కండరాలు అలసటకు లోనవుతాయి కాబట్టి ప్రతి 20 నిమిషాలకూ 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలోని వస్తువును చూడగలిగితే, కంటి కండరాలు రిలాక్స్ అవుతాయి.

ఏం చేయాలి?

కళ్లు అలసటకు లోనై పొడిబారినా, మండుతున్నా, నీరు కారుతున్నా మానిటర్ల వాడకం ఆపేసి, 20-20-20 నియమం అనుసరించాలి. దీంతో ఫలితం లేనప్పుడు కంటి వైద్యులను కలిసి, వాళ్లు సూచించే కంటి చుక్కల మందులు వాడుకోవాలి. వీటితో పొడిబారిన కళ్లు తేమగా మారతాయి. ఈ చుక్కల మందును ఫ్రిజ్ డోర్‌లో దాచుకుని వాడుకోవాలి. అలాగే ఈ చుక్కల మందును ఒకసారి మూత తెరిచి, వాడడం మొదలుపెట్టిన తర్వాత నెల రోజుల వరకూ వాడుకుని, మిగతా మందును పారేయాలి. దాచుకుని వాడుకోకూడదు.

అయితే ఈ చుక్కల మందును ఎవరికి వారు కొనుక్కుని వాడుకోవడం సరి కాదు. కంటి సమస్యలకు కారణం స్క్రీన్స్ మాత్రమే అని నిర్ధారించలేం! ఇతరత్రా కంటి సమస్యల్లో కూడా ఈ లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. కాబట్టి వైద్యులు సూచించినప్పుడు మాత్రమే వీటిని వాడుకోవాలి.

డాక్టర్ ఎమ్. నిఖిల,
కన్సల్టెంట్ ఆప్తల్మాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్



పరిశోధన

బరువు తగ్గించే అమైనో ఆమ్లం

బరువు తగ్గడంలో అమైనో ఆమ్లం కీలక పాత్ర పోషిస్తుందని అమెరికా, కెనడా పరిశోధకులు కనుగొన్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం...

మాంసం, తృణధాన్యాల్లోని సిస్టీన్ అనే అమైనో ఆమ్లం, బరువు తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని ఎలుకలపై చేసిన ఓ తాజా అధ్యయనంలో తేలింది. దీని వలన అమైనో ఆమ్లాలతో ఔషధాల అభివృద్ధికి అవకాశం కలుగుతుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేశారు. 9 రకాల అమైనో ఆమ్లాలు లేని ఆహారం అందించి ఎలుకలను పరిశీలించినప్పుడు, పలు అణువులను అమైనో ఆమ్లంగా మార్చే ఎంజైమ్ లోపించిన ఎలుకలు, సిస్టీన్ రహిత ఆహారం తిని వారంలోనే 31 శాతం బరువు తగ్గినట్టు నేచర్‌లో ప్రచురితమైన ఆ అధ్యయనంలో వెల్లడించారు. అయితే ఎంజైమ్ ఉన్న ఎలుకలు సిస్టీన్ రహిత ఆహారం తీసుకున్నా బరువు తగ్గలేదు. అయితే ఆ ఎంజైమ్ ఉన్న ఎలుకలు పరిమిత క్యాలరీల సిస్టీన్, మిథియోనిన్ లేని ఆహారం తీసుకున్నప్పుడు, 25 శాతం బరువు తగ్గే అవకాశం ఉందని పరిశోధకులు కనుగొన్నారు.



మనుషులకు మంచిదేనా?

ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీలో చేసిన ఓ మానవ ప్రయోగంలో... సిస్టీన్, మెథియోనిన్ తక్కువగా ఉన్న ఆహారం తిన్న వారిలో ఎలాంటి ప్రతికూల ప్రభావాలు కనుగొనలేదని, అలాగే వారు బరువు తగ్గినట్టు గుర్తించామని పరిశోధకులు వెల్లడించారు. అయితే ఈ విధమైన ఆహారం ప్రజలపై ఎంత ప్రభావంతంగా పనిచేస్తుంది, ఏ మేరకు సురక్షితమన్నది తెలుకోవడం కోసం మరిన్ని పరిశోధనలకు అవసరమని వారు పేర్కొన్నారు. సిస్టీన్ చాలా ఆహార పదార్థాల్లో ఉంటుంది కాబట్టి ఆహారం ద్వారా సిస్టీన్ అందకుండా చేయడం సవాలుతో కూడుకున్న విషయమని అభిప్రాయపడ్డారు. కాబట్టి సిస్టీన్ స్థాయులను అవసరమైన మేర తగ్గించడానికి ఔషధాలను అభివృద్ధి చేయడం సరైన మార్గమనీ, ఆ ఔషధాలు కొవ్వు తగ్గించడానికి కూడా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

మీకు తెలుసా?

కృత్రిమ రక్తం

రక్తదానం ప్రాణదానంతో సమానం. కానీ అనేక సందర్భాల్లో సమయానికి సరిపడా రక్తం దొరకక, సరిపోలే రక్తగ్రూపు అందుబాటులో లేక సర్జరీలు వాయిదా పడుతూ ఉండడం, ప్రాణనష్టం సంభవించడం మనం చూస్తూ ఉంటాం. అయితే ఇలాంటి ఇబ్బందులకు చెల్లుచీటీ రాస్తూ, నేషనల్ డిఫెన్స్ మెడికల్ కాలేజీకి చెందిన జపాన్ పరిశోధకులు కృత్రిమ రక్తాన్ని రూపొందించారు.



ఈ కృత్రిమ రక్తాన్ని రక్తపు గ్రూపు మ్యాచింగ్‌తో సంబంధం లేకుండా, ఎవరైనా మార్పిడి చేసుకోవచ్చు. ఈ సింథటిక్ రక్తంలో ఎర్ర రక్త కణాలతో పాటు, ప్లేట్‌లెట్లు కూడా ఉంటాయి. ఇప్పటివరకూ చేపట్టిన జంతు ప్రయోగాల్లో ఈ రక్తంతో విజయవంతంగా రక్త నష్టాన్ని భర్తీ చేయగలిగారు. దానం చేసిన రక్తానికి భిన్నంగా ఈ కృత్రిమ రక్తాన్ని ఎక్కువ కాలం కూడా నిల్వ చేసుకోవచ్చు. దీన్ని గది ఉష్ణోగ్రత వద్ద ఏకంగా ఏడాది పాటు నిల్వ చేసుకుని, అత్యవసర సమయాల్లో, మారుమూల ప్రాంతాలకు తరలించడానికి ఉపయోగించుకోవచ్చు.

ఆవిష్కరణ

గర్భం వెలుపల పిండం

శరీరం వెలుపల పిండాన్ని పెంచే వీలుండే కృత్రిమ గర్భాశయాన్ని జపాన్ అభివృద్ధి చేసింది. జపాన్, ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకులు నెలలు నిండకుండా పుట్టిన, జబ్బుపడిన పిండాలకు చికిత్సలందించి, ప్రాణాలను కాపాడడం కోసం, ఎక్స్ వివో యుటెరిన్ ఎన్విరాన్‌మెంట్ థెరపీ ప్రధానంగా ఈ ఆవిష్కరణకు పూనుకుంది. ఈ కృత్రిమ గర్భాశయం, నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లో తలెత్తే సమస్యలను అడ్డుకునే నియంత్రిత పర్యావరణాన్ని కలిగి ఉండడం విశేషం. అయితే మానవ శరీరం వెలుపల తొమ్మిది నెలల పిండాన్ని పెంచడం ఈ సాంకేతిక ఆవిష్కరణ ఉద్దేశం కాదనీ, కేవలం నెలలు నిండకుండా పుట్టిన పిల్లల ప్రాణాలను కాపాడడమే తమ ప్రధాన ఉద్దేశమని ఈ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.



ప్రపంచంలో అత్యంత విలువైన టెక్ దిగ్గజాల్లో రిలయన్స్

రూ.18.45 లక్షల కోట్ల మార్కెట్ విలువతో 23వ స్థానంలో అంబానీ కంపెనీ

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు మరో గౌరవం దక్కింది. ప్రపంచంలోని 30 అత్యంత విలువైన లిస్టెడ్ టెక్ దిగ్గజ కంపెనీల జాబితాలో రిలయన్స్‌కూ చోటు లభించింది. ఈ లిస్ట్‌లో స్థానం దక్కించుకున్న ఏకైక భారత కంపెనీ ఇదే. 'ట్రెండ్స్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' పేరుతో సోమవారం విడుదలైన రిపోర్టు ప్రకారం.. 21,600 కోట్ల డాలర్ల (రూ.18.45 లక్షల కోట్లు) మార్కెట్ విలువతో రిలయన్స్ 23వ స్థానంలో నిలిచింది. కాగా, అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, యాపిల్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా ప్లాట్‌ఫామ్స్, టెస్లా, బ్రాడ్‌కామ్ వరుసగా తొలి 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి. తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ 9వ స్థానంలో ఉంది. చైనా కంపెనీ టెన్సెంట్ 10వ స్థానంలో ఉంది.

ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 22 శాతం వృద్ధి లక్ష్యం: ఎన్ఎండీసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ ఈ ఏడాది ఇనుప ఖనిజం ఉత్పత్తిని 22% మేరకు పెంచి 5.5 కోట్ల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి 10 కోట్ల టన్నులకు ఉత్పత్తిని విస్తరించాలన్న బృహత్ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 4.5 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించింది. ఏప్రిల్, మే నెలల్లో 45% వృద్ధితో 84.3 లక్షల టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి చేసినట్టు తెలిపింది.

వైమానిక రంగంలో అద్భుత అవకాశాలు



విదేశీ సంస్థలు పెట్టుబడులతో రావాలి
విమానాల తయారీ కేంద్రంగా భారత్
ఐఏటీఏ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత వైమానిక రంగం పెట్టుబడులకు అద్భుత అవకాశాల గని అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వార్షిక సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. 2030 నాటికి భారత విమానాల నిర్వహణ, మరమ్మతులు, కార్యకలాపాల (ఎంఆర్ఓ) రంగం 400 కోట్ల డాలర్ల స్థాయికి చేరనుందన్నారు. భారత్‌ను విమానాల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భారత్‌ను ఒక మార్కెట్‌గా కాకుండా.. వాల్యూ చెయిన్ లీడర్‌గా చూడాలని కోరారు. దేశీయ విమానయానపరంగా చూస్తే ప్రస్తుతం భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఎదిగిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు విమానయానాన్ని దగ్గర చేసేందుకు తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉడాన్ పథకం భారత విమానయాన చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమన్నారు.

విమాన సంస్థల లాభాలు రూ.3 లక్షల కోట్లు

కొన్ని సమస్యలు, సవాళ్లు ఉన్నా ఈ సంవత్సరం అంతర్జాతీయ విమానయాన సంస్థలు 97,900 కోట్ల డాలర్ల (సుమారు రూ.83.59 లక్షల కోట్లు) ఆదాయంపై 3,600 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.07 లక్షల కోట్లు) లాభాలు ఆర్జించే అవకాశం ఉందని ఐఏటీఏ అంచనా. గత ఏడాదితో పోలిస్తే ఇది 360 కోట్ల డాలర్లు ఎక్కువని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ ప్రకటించారు. ప్రస్తుతం విమానయాన రంగం ప్రపంచ జీడీపీలో 3.9 శాతం వాటా కలిగి ఉందన్నారు. భారత విమానయాన రంగం జీడీపీకి 560 కోట్ల డాలర్లు (సుమారు రూ.47,818 కోట్లు) సమకూరుస్తూ నేరుగా 3,69,700 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోందన్నారు. ఖర్చులు, పన్నుల భారం పెరుగుతున్నా పదేళ్ల క్రితంతో పోలిస్తే విమానయాన సంస్థల వాస్తవ ఖర్చులు 40 శాతం వరకు తగ్గాయని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ అన్నారు. పరోక్షంగా విమానయాన రంగంతో ముడిపడి ఉన్న పర్యాటక రంగాన్ని కూడా కలుపుకుంటే భారత విమానయాన రంగం 77 లక్షల మందికి ఉపాధి, జీడీపీకి 1.5 శాతం సమకూరుస్తోందన్నారు.

ప్లాంట్ పెట్టేందుకు రెడీ: ఎంబ్రాయర్

భారత్‌లో పూర్తి స్థాయి అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయర్ విమానాల తయారీ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. కాకపోతే ఇందుకు భారత విమానయాన సంస్థల నుంచి కనీసం 200 విమానాల ఆర్డర్ అవసరమని కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ ఫ్రాన్సిస్కో గోమెస్ నెటో స్పష్టం చేశారు. ఐఏటీఏ సదస్సుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. తమ విమానాలు అమ్మేందుకు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు నెటో వెల్లడించారు.

మరో 50 ఎయిర్‌పోర్టులు

వచ్చే ఐదేళ్లలో దేశంలో కొత్తగా మరో 50 విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నట్టు ఇదే సదస్సులో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉంటే, ప్రస్తుతం ఆ సంఖ్య 164కు చేరిందన్నారు. ఉడాన్ పథకంతో దేశంలో విమానయానం ప్రజాస్వామ్యీకరించబడి 619 మార్గాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విమానాల నిర్వహణ మరమ్మత్తులకూ భారత్‌ను కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించారు.

అదానీ గ్రూప్‌పై అమెరికా దర్యాప్తు!

గుట్టుగా ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి
తోసిపుచ్చిన అదానీ గ్రూప్

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ గ్రూప్ మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. గుజరాత్‌లోని తన ముంద్రా రేవు ద్వారా కొన్ని కంపెనీలు ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి చేసుకునేందుకు సహకరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై అమెరికా దర్యాప్తు సంస్థలు దర్యాప్తు ప్రారంభించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనం ప్రచురించింది. అయితే అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇరాన్ నౌకలు ఏవీ కూడా ఎల్‌పీజీతో తమ రేవులకు రాలేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తమపై అమెరికా సంస్థలు దర్యాప్తు జరుపుతున్న విషయం కూడా తమకు తెలియదని తెలిపింది. కొన్నిసంస్థలు దురుద్దేశాలతో తమపై కావాలనే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు ప్రచారం చేస్తున్నాయని అదానీ గ్రూప్ తెలిపింది. 'మా రేవుల ద్వారా ఇరాన్ నుంచి వచ్చే ఎలాంటి సరుకుల ఎగుమతి, దిగుమతులను అనుమతించడం లేదు. అది మా విధానపరమైన నిర్ణయం. ఇరాన్ జెండాతో వచ్చే నౌకలు లేదా నేరుగా ఇరాన్ రేవుల నుంచి వచ్చే నౌకలు అన్నిటికి ఇది వర్తిస్తుంది' అని తెలిపింది.

ఈ విడత 0.50% వడ్డీకోత: ఎస్‌బీఐ

దేశంలో రుణ విభాగాన్ని ఉత్తేజితం చేయడంతో పాటు పలు రకాల అస్థిరతలను దీటుగా ఎదుర్కొనగల శక్తి కల్పించడం కోసం రిజర్వ్ బ్యాంక్ ఈసారి అర శాతం మేరకు రెపోరేటును తగ్గించవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. బుధవారం ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాలు ప్రారంభమవుతాయి. శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఎంపీసీ నిర్ణయాలను ప్రకటించనున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,640 ▲	89,500 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	99,820 ▲	89,500 ▲	1,11,000 ▲
రాజమండ్రి	98,840 ▲	90,600 ▲	1,00,300 ▲
ప్రొద్దుటూరు	96,250 ▲	88,550 ▲	98,600 ▲
ముంబై	96,680 ▲	88,559 ▲	97,761 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ

హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	112
కరీంనగర్	107	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	97
కర్నూలు	107	నెల్లూరు	102
విశాఖపట్నం	101	అనంతపురం	102
గోదావరి	109		

విదేశీ కంపెనీలు ఉత్పత్తికి సై అంటే దిగుమతి సుంకం 15 శాతమే..

8,000 ఈవీలకు మాత్రమే అనుమతి
దేశీయ తయారీపై కనీస పెట్టుబడి రూ.4,150 కోట్లు ఉండాలి
కొత్త ఈవీ పాలసీ మార్గదర్శకాలు విడుదల

న్యూఢిల్లీ: దేశీయంగా విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీకి ముందుకు వచ్చే విదేశీ కంపెనీలకు దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈవీల స్థానిక తయారీని పటిష్ఠం చేయడం, ప్రపంచ పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం లక్ష్యంగా రూపొందించిన కొత్త ఈవీ విధానం మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం నోటిఫై చేసింది. దీంతో ఈ పాలసీ ఇప్పుడు అమలులోకి వచ్చినట్టవుతుంది. దాని ప్రకారం ఈవీల తయారీలో కనీసం రూ.4,150 కోట్ల పెట్టుబడులు పెట్టే ఆటో తయారీదారులను 15% తగ్గింపు సుంకంపై 8,000 ఈవీలు దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తారు. అయితే అనుమతులు పొందిన తేదీ నుంచి మూడు సంవత్సరాల్లోగా ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించడంతో పాటు తయారీలో ఎంత శాతంలో స్థానిక ఉత్పత్తులు వినియోగించేది ప్రకటించాల్సి ఉంటుంది.

ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా రెండు వారాల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటవుతుందని, 120 రోజులు అది అందుబాటులో ఉంటుందని అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత కూడా వచ్చే ఏడాది మార్చి 15 వరకు ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు దరఖాస్తుల విభాగాన్ని తెరిచే అవకాశం ఉంది. ఈ స్కీమ్ కింద ఒక్కో దరఖాస్తుదారునిపై కోల్పోయే సుంకాల గరిష్ఠ పరిమితి రూ.6,484 కోట్లుగా ఉండనుందన్నారు.

భారత్‌లో తయారీపై టెస్లా అనాసక్తి

ప్రపంచ ఆటోమొబైల్ కంపెనీలు మెర్సిడెస్ బెంజ్, స్కోడా-ఫోక్స్‌వేగన్, హ్యుండయ్, కియా దేశంలో విద్యుత్ కార్ల తయారీపై ఆసక్తిని ప్రకటించాయని ఈ పాలసీ మార్గదర్శకాల విడుదల సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. అయితే ప్రపంచ ఈవీ దిగ్గజం టెస్లా మాత్రం దేశీయ తయారీ పట్ల ఆసక్తిగా లేదని, దేశంలో తమ షోరూమ్‌లు ప్రారంభించేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నదని ఆయన చెప్పారు.

మార్కెట్లో మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు

» సెన్సెక్స్ 77 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లను మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు అలుముకున్నాయి. స్టీల్, అల్యూమినియంపై సుంకాలను రెట్టింపు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం, ఈ మధ్యనే కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ అమెరికా-చైనా పరస్పర ఆరోపణలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మళ్లీ తీవ్రతరం కావడం, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌కు గండికొట్టాయి. దాంతో సోమవారం సెన్సెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లో 796.75 పాయింట్లు క్షీణించి 80,654 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ చివరికి 77.26 పాయింట్ల నష్టంతో 81,373.75 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ప్రారంభంలో 224.55 పాయింట్ల వరకు కోల్పోయినప్పటికీ, చివరికి 34.10 పాయింట్ల నష్టంతో 24,716.60 వద్ద స్థిరపడింది. గత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా 6.5 శాతంగా నమోదవడంతో పాటు జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రెండో నెలా రూ.2 లక్షల కోట్లు దాటడం, ఈసారి ఆర్‌బీఐ రెపో రేటును అర శాతం వరకు తగ్గించవచ్చన్న అంచనాలు సూచీల రికవరీకి తోడ్పడ్డాయి.

మీనాక్షి ఆల్టర్నేట్స్ రియల్టీ ఫోకస్డ్ ఫండ్

700 కోట్ల కార్పస్‌తో ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన రియల్టీ, శుద్ధ ఇంధన వ్యాపారాల నిర్వహణలోని మీనాక్షి గ్రూప్ తాజాగా ఆర్థిక సేవల రంగంలోకి ప్రవేశించింది. మీనాక్షి ఆల్టర్నేట్స్ (ఎం-ఆల్ట్స్) పేరుతో ఆర్థిక సేవల అనుబంధ విభాగంతో పాటు దాని పరిధిలో తొలి ఫండ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు మీనాక్షి గ్రూప్ వెల్లడించింది.

'మీనాక్షి రియల్ అసెట్స్ ఫండ్' పేరుతో రూ.700 కోట్ల కార్పస్‌తో ఈ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సెబీ అనుమతితో కూడిన కేటగిరీ-2 ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్) ఇది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

విడుదలకు సిద్ధమైన ఘాటీ



అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఘాటీ'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. తాజాగా, ఈ సినిమాను జూలై 11న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ప్రకటించి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సినిమాలోని ప్రధాన పాత్రధారులు సంచులు మోసుకుంటూ నదిని దాటుతున్న విజువల్స్ ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: చాణక్యరెడ్డి తూరుపు, వెంకట్ ఎన్.స్వామి, సినిమాటోగ్రఫీ:మనోజ్‌రెడ్డి కాటసాని, సంగీతం:నాగవెల్లి విద్యాసాగర్. కాగా, 'వేదం' తర్వాత క్రిష్, అనుష్క కాంబోలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.

ధనుష్ నటనకు జాతీయ అవార్డు వస్తుంది





శేఖర్ కమ్ముల

నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుష్కర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా, చెన్నైలో ఆడియో వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన చిత్రం. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది. నాగార్జున, ధనుష్‌ల నటన నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ధనుష్ ఆల్‌రౌండర్. ఈ చిత్రంలో ఆయన నటనకు జాతీయ అవార్డు వస్తుంది" అని అన్నారు. "సినిమా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది. శేఖర్ కమ్ముల అద్భుతంగా సినిమాను తెరకెక్కించారు. రజనీకాంత్‌తో నేను నటించిన 'కూలీ' సినిమా మీ అందరి ఊహలకు మించి ఉండబోతోంది" అని నాగార్జున చెప్పారు. "శేఖర్ కమ్ముల స్వచ్ఛమైన మనసు ఉన్న వ్యక్తి. ఇందులో చేసిన పాత్ర నాకెంతో ప్రత్యేకం" అని ధనుష్ తెలిపారు.

ఎంత దుష్ప్రచారం చేస్తారో చేస్కోండి

తనపై వస్తున్న దుష్ప్రచారాలపై ధనుష్ ఈ సందర్భంగా స్పందించారు. "నేనెప్పుడూ నా బెస్ట్ ఇవ్వడానికే ప్రయత్నిస్తుంటాను. నాపై, నా సినిమాలపై ఎంతగా దుష్ప్రచారం చేస్తారో చేసుకోండి. నా సినిమాల విడుదలకు ముందు ప్రతిసారి ఏదో ఒక విషయంలో కుట్రలు పన్నుతూనే ఉంటారు. అయినా ఆ ప్రయత్నాలు నన్నేమీ చేయలేవు. నా అభిమానులు 23 ఏళ్లుగా నా వెన్నంటే ఉన్నారు. ఇలాంటి సర్కస్‌లు చేయడం మానుకోండి. ఎవరెంత దుష్ప్రచారం చేసినా అభిమానులు నాతోనే ఉంటారు" అని పేర్కొన్నారు.

ఫిల్మ్ చాంబర్‌లో 'వీరమల్లు' నిర్మాత



సినిమా టికెట్ ధరల పెంపు లేదా ఏ ఇతర విషయాలకు సంబంధించి అయినా సినీ పరిశ్రమకు చెందిన వారితో వ్యక్తిగత చర్చలకు తావులేదని ఇటీవలె ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పవన్ సూచన మేరకు 'హరి హర వీరమల్లు' చిత్ర నిర్మాత ఏ.ఎం.రత్నం తాజాగా ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్‌ను కలిశారు. తమ చిత్రానికి సంబంధించి అదనపు షోలకు అనుమతి, టికెట్ ధరల సవరణ కోరుతూ లేఖను అందజేశారు. 'హరి హర వీరమల్లు' సినిమా ఈనెల 12న విడుదల కానుంది.

మనసును తాకేలా



సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమా 'తెలుసు కదా'. నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. దీపావళి సందర్భంగా అక్టోబర్ 17 సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఊహించని మలుపులతో నిండిన ఈ సినిమా ప్రేక్షకుల మనసును తాకేలా ఉంటుందని తెలిపారు.

థగ్‌లైఫ్‌ను అడ్డుకుంటాం



కన్నడ భాష గురించి నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలతో థగ్‌లైఫ్ సినిమాను కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ నెల 5న సినిమాను కర్నాటకలో విడుదల చేస్తే థియేటర్లకు నిప్పు పెడతామని కర్ణాటక రక్షణ వేదిక(కరవే) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ గౌడ హెచ్చరించారు. కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ మైసూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ, కమల్‌హాసన్ సినిమాను బహిష్కరించాల్సిందేనని అన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన కమల్ హాసన్

థగ్‌లైఫ్ సినిమాకు వస్తున్న బెదిరింపులపై కమల్ హాసన్, కర్నాటక హైకోర్టును ఆశ్రయించారు. సినిమా ప్రదర్శనకు ఎలాంటి అడ్డంకులు లేకుండా తగిన భద్రత కల్పించేలా చూడాలని కోర్టుకు విన్నవించారు. ఇదిలా ఉంటే తమిళం నుంచి కన్నడ పుట్టిందని కమల్ హాసన్ వ్యాఖ్యానించినప్పుడు తాను చప్పట్లు కొట్టలేదని నటుడు శివరాజ్‌కుమార్ వివరణ ఇచ్చారు. అన్ని భాషలూ ముఖ్యమైనవేనని, తన మాతృభాష కన్నడకే ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని ఇంతకు ముందే చెప్పానని అన్నారు. కన్నడ కోసం తన ప్రాణమైనా ఇస్తానని అన్నారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)


లింగంపేట పోస్టాఫీసు వద్ద పింఛన్ డబ్బుల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

కాంట్రాక్ట్ ముగిసిందని పింఛన్ చెల్లింపుల నిలిపివేత!

- పింఛన్ కోసం పోస్టాఫీస్ వద్ద వందల మంది పడిగాపులు
- పింఛన్ కోసం దూరప్రాంతాల నుంచి వచ్చిన లబ్ధిదారులు

లింగంపేట, జూన్2 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ డబ్బులను పోస్టాఫీసు ద్వారా అందిస్తోంది. మే నెలలో ఇవ్వాల్సిన పింఛన్ డబ్బులను పోస్టాఫీసులలో కేవలం మూడు రోజులు ఇచ్చి మూసివేశారు. దీంతో సోమవారం పింఛన్ డబ్బుల కోసం లింగంపేట, ఐలాపూర్‌లతో పాటు ఇతర గ్రామాలకు చెందిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పోస్టాఫీసుకు వచ్చారు. పోస్టు మాస్టర్‌ను పింఛన్ డబ్బుల కోసం అడుగగా ఈనెలలో ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చేశామని తిరిగి మరో నెలలో రావాలని చెప్పడంతో వృద్ధులు ఆవేదనతో రోధించారు. ప్రతీనెల వారం రోజుల పాటు పింఛన్ డబ్బులను చెల్లిస్తారని ఈనెలలో మూడు రోజులు ఇచ్చి నిలిపి వేశారని గత నెలలోనూ డబ్బులు తీసుకోలేదని, రెండు నెలల డబ్బులు తీసుకుందామని వస్తే మూడు రోజులు ఇచ్చి మూసి వేశారని బాధపడుతున్నారు. కొన్ని కుటుంబాలు బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లగా వారితో పాటు వెళ్లిన వృద్ధులు, వికలాంగులు పింఛన్ డబ్బుల కోసం ఎంతో ఆశతో పోస్టాఫీసుకు రాగా డబ్బులు లేవని చెప్పడంతో తిరిగి వెళ్లేందుకు డబ్బులు లేవని బాధపడుతున్నారు. ఇలా ఒక్కొక్కరిది ఒక్కో బాధ. వారంత ఎస్పీఎమ్ సూర్యకాంత్‌ను డబ్బుల కోసం బతిమాలుకున్నారు. తానేమీ చేయలేనని పోస్టాఫీసుకు ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్ట్ గడువు మే 31తో ముగిసిందని, అందుకే మే 31వరకు చెల్లించామని ఆయన తెలిపారు. మే 27 నుంచి 30వరకు పింఛన్ డబ్బులు చెల్లించామని ఆయన తెలిపారు. మొత్తం మండలంలో 5358మంది పింఛన్ దారులు ఉండగా అందులో 4వేల మంది పింఛన్ డబ్బులు తీసుకున్నారు. మిగతా వేయి మంది పింఛన్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు చొరవ తీసుకుని వృద్ధులు, వికాలాంగులు, వితంతువుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పింఛన్ డబ్బులను మరో రెండు రోజులు చెల్లించాలని బాధితులు కోరుతున్నారు. పింఛన్ డబ్బులపైనే బతుకుతున్న వృద్ధులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

నాకు పింఛనే జీవనాధారం



● మన్నె పోచవ్వ, ఐలాపూర్

గతనెలలో జ్వరం రావడంతో డబ్బుల కోసం పోస్టాఫీసుకు రాలేకపోయాను, ఈనెలలో శనివారం పింఛన్ డబ్బులు ఇస్తున్నారని తెలిసి వస్తే అప్పటికే మూసివేశారు. తిరిగి సోమవారం వస్తే వచ్చే నెలలో ఇస్తామంటున్నారు. నేను పింఛన్ డబ్బులతోనే బతుకుతాను మరో నెల రోజుల పాటు ఎలా బతుకాలి. మరో రెండు రోజులు ఇస్తే అందరికి డబ్బులు అందుతాయి. అకస్మత్తుగా మూసి వేస్తే ఎలా బతుకుతాము.

పింఛన్ కోసం హైదరాబాద్ నుంచి వచ్చా..



● తాడ్వాయి చిన్న లక్ష్మి, లింగంపేట

మా కుటుంబం హైదరాబాద్‌కు బతుకుదెరువు కోసం వెళ్లింది. నేను వారితోనే హైదరాబాద్‌లో ఉంటున్నాను. ప్రతీనెల రావడం కష్టంగా ఉందని ప్రతీ రెండునెలలకు ఒకసారి డబ్బులు తీసుకుంటున్నా. నాకు శనివారం పింఛన్ డబ్బులు ఇస్తున్నారని తెలిసింది. సోమవారం ఉదయం వస్తే డబ్బులు లేవని చెబుతున్నారు. వచ్చే నెలలో తీసుకోవాలని చెబుతున్నారు. పింఛన్ డబ్బులు ఎంతో ఆసరగా ఉంటాయి. మా బాధలను గుర్తించాలి.

ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్ట్ ముగిసింది

● సూర్యకాంత్, ఎస్పీఎమ్

పింఛన్ డబ్బుల చెల్లింపునకు ప్రభుత్వం పోస్టాఫీసులకు ఇచ్చిన గడువు మే నెల 31తో ముగిసింది. పింఛన్ డబ్బులు ప్రభుత్వం 27న పోస్టాఫీసు ఖాతాల్లో వేయగా అదేరోజు సాయంత్రం నుంచి డబ్బులు ఇచ్చాం. 30వ తేదీ వరకు ఇచ్చాం. మండలంలో 5358 మంది పింఛన్‌దారులు ఉండగా 4800 మందికి ఇచ్చాం. మరో 600 మందికి చెల్లించాల్సి ఉంది.

- భారత సైనిక దళంలో 80 మంది రుద్రూరు మండల యువత
- దేశసేవ కోసం కొన్నేళ్లుగా బాధ్యతాయుత విధులు
- వీరిని ఆదర్శంగా తీసుకున్న యువకులు
- ఆర్మీ రిక్రూట్‌మెంట్ వస్తే చాలు పరుగులు పెడుతున్న మండలంలోని ఆయా గ్రామాల యువత

సరిహద్దుల్లో.. రుద్రూర్ సైన్యం



రుద్రూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో శాంతిభద్రతలను నెలకొల్పడానికి నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండలం నుంచి జవాన్లు భాగస్వాములు అవుతున్నారు. దేశ ప్రజలకు శాంతియుత వాతారణం కల్పించడానికి రక్షణ కవచంగా ఏర్పడిన భారత సైనిక దళంలో విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ దేశసేవలో నిమగ్నమయ్యారు. శత్రుమూకల సవాళ్లు, ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారు. వ్యవసాయ కుటుంబాలకు చెందిన ఆ యువకులు పేదరికం అడ్డు వచ్చిన ఇతర సమస్యలు ఎదురైన వెనుకంజ వేయకుండా అనుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగుతున్నారు.

దేశసేవకు గ్రామం నుంచి 80 మంది..

నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండలంలోని అక్బర్‌నగర్, చిక్కడ్‌పల్లి, రుద్రూరు, సిద్దాపూర్, రాయకూర్, రాణంపల్లితో పాటు తదితర గ్రామాలలో కలిపి భారత సైనిక దళంలో దాదాపు 80 మంది వరకు యువకులు ఆర్మీలో పని చేయడం విశేషం. దేశ సేవ చేయడానికి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనేందుకు యువత మొగ్గు చూపుతోంది. ఖాళీలు ఉన్నాయని పత్రికలు, సోషల్ మీడియాలో వార్తలు వస్తే చాలు ఆన్‌లైన్‌లో పెద్దఎత్తున యువత దరఖాస్తులు చేసుకుని రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే ముందు ఉదయం, సాయంత్రం వేళ పరుగు, లాంగ్ జంప్, హైజంప్ వంటి వ్యాయమాలు చేస్తున్నారు. కొంతమంది యువతకు పేదరికం అడ్డు రావడంతో రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనలేకపోతున్నారు. దేశ సేవలో ఇంతమంది పనిచేయడం ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.

● అక్బర్‌నగర్ గ్రామం నుంచే 20మంది

రుద్రూరు మండలంలోని అక్బర్‌నగర్ గ్రామం నుంచే దేశ సేవలో దాదాపు 20మంది యువకులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామం చిన్నదే అయినా తల్లిదండ్రుల సహకారంతో ఒకరిని చూసి మరొకరు దేశసేవ చే యాలన్న లక్ష్యంతో ఆ గ్రామ యువకులు పట్టువదలని విక్రమార్కుడిలా కసరత్తు చేస్తున్నారు. ఎలాగైనా ఉద్యోగాలు సాధించాలని కఠోర శిక్షణ చేసి ఆర్మీలో చేరుతున్నారు. దేశసేవలో మేము సైతం అంటూ రుద్రూరు మండలానికి చెందిన పలువురు యువకులు భాగస్వాములయ్యారు. ఎన్నో ఉద్యోగాలు ఉన్నా మనస్సు నిండా దేశభక్తితో ఆర్మీ ఉద్యోగాలను సాధించేందుకు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. సమస్యలు ఎదురైన వెనుకంజ వేయకుండా అనుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగుతున్నారు.

విధుల్లో నిమగ్నమైన రుద్రూర్ యువత

రుద్రూరు మండలంలోని ఆయా గ్రామాల నుంచి సైనిక దళంలో చేరిన యువత తమ విధుల్లో నిమగ్నమైంది. అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన బాలరాజుగౌడ్ హర్యానా ప్రాంతంలో ఎన్ఎస్‌జీ బ్లాక్ కమాండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన ఏజాజ్, షేక్ మహబూబ్ పంజాబ్‌లోని ఫేరోజ్‌పూర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అలాగే రుద్రూరు గ్రామానికి చెందిన జావీద్, నవీన్, గంగాధర్ పాటు సిద్దాపూర్‌కు చెందిన దత్తు, చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన నక్క అశోక్ దేశ రక్షణలో భాగంగా సరిహద్దు ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్నారు.

● తల్లిదండ్రుల ప్రోత్సహంతో..

రుద్రూరు మండలం అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన బాలరాజుగౌడ్ వ్యవసాయ కుటుంబానికి చెందిన ఇతను ఆర్మీలో చేరడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. తొలి ప్రయత్నంలో రాత పరీక్షలో కొన్నిమార్కుల తేడాలో ఉద్యోగాన్ని అందుకోలేకపోయాడు. మరోమారు ప్రయత్నం చేయాలని తల్లిదండ్రులు ప్రోత్సహించారు. రెండో ప్రయత్నంలో విజయం సొంతమైంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే సాధ్యమైందని బాలరాజు గౌడ్ పేర్కొంటున్నారు. బాలరాజుగౌడ్ ప్రస్తుతం హర్యానా ప్రాంతంలో ఎన్ఎస్‌జీ బ్లాక్ కమాండర్‌గా పని చేస్తున్నాడు.


మణిపూర్‌లో విధులు నిర్వహిస్తున్న ఏజాజ్


చలి ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న జావీద్


పంజాబ్‌లో ఆర్మీ విధుల్లో ఉన్న నవీన్

● ప్రతికూల పరిస్థితుల్లో

రుద్రూరు మండలానికి చెందిన జావీద్ కుటుంబ కూలి, నాలి చేసుకుంటూ కుటుంబాన్ని గడిపేవారు. జావీద్ దేశ సేవ కోసం ఆర్మీలో చేరాలని లక్ష్యంగా పెట్టుకుని ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం జమ్ముకాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

● దేశసేవే లక్ష్యంగా..

రుద్రూరు మండల కేంద్రానికి చెందిన నక్క నవీన్ దేశ సేవ చేయాలనే ఉద్దేశంతో ఆర్మీ ఉద్యోగం కోసం పరితపించారు. ఆ కుటుంబానికి ఆసరాగా నిలవాలని చదువు పూర్తి కాగానే ఆర్మీలో చేరడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అనుకున్నది సాధించాడు. ప్రస్తుతం పంజాబ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.

● ఇబ్బందులు అధిగమించి..

రుద్రూరు మండలం అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన ఏజాజ్ నిరంతరం శ్రమిస్తూ చివరికి ఆర్మీ ఉద్యోగం సాధించాడు. ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ వాటిని ఇష్టంగా మలుచుకున్నాడు. ముందుకు సాగాడు. ప్రస్తుతం ఏజాజ్ మణిపూర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

భిక్కనూరు, జూన్2 (ఆంధ్రజ్యోతి): జీవితంలో యోగాను ఓ భాగంగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లబిస్తుందని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఆశావర్కర్లకు, ప్రజలతో యోగాసనాలు వేయించి యోగాపై, డైట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మే27 నుంచి ఈనెల 21వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రతిఒక్కరు ప్రతిరోజు యోగా చేయాలన్నారు.

నూతన పాఠ్య పుస్తకాల పంపిణీ

ఎల్లారెడ్డి, జూన్2 (ఆంధ్రజ్యోతి): పట్టణకేంద్రంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద సోమవారం ఎంఈఓ లింగాపురం రాజులు ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి నూతన పాఠ్య పుస్తకాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు.

లింగంపేట: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సోమవారం ఉచిత పాఠ్యపుస్తకాలను పాఠశాలల ప్రధానోపాధ్యా యులకు ఎంఈవో శౌకత్‌అలీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలు ప్రారంభం కాగానే పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేయాలని ఆయన తెలియజేశారు. మండలానికి మొత్తం 21వేల పాఠ్య పుస్తకాలు వచ్చాయని ఆయన తెలిపారు. పాఠ్యపుస్తకాలతోపాటు ఏక రూప దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తోందని చెప్పారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

మద్నూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో యువకుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. మద్నూర్ మార్కెట్ వ్యాపారు ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ముగిశాయి. ఐదు రోజులుగా మండల కేంద్రంలో క్రికెట్ పోటీలతో యువకుల కేరింతలతో మారుమోగింది. గెలుపొందిన విజేతలకు మద్నూర్ ఎస్సై విజయ్ కొండ బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి మేనూర్ గ్రామ యువకులు అందుకోగా, ద్వితీయ బహుమతి శేఖపూర్ గ్రామ యువకులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వ్యాపారులు తమ వ్యాపారంతో పాటు యువకుల కోసం క్రికెట్ పోటీలను ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. ప్రతి ఒక్కరికి క్రీడలు ఎంతో అవసరమని వీటితో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హనుమాన్లు స్వామి, వ్యాపారులు సంతోష్, రాజేష్, బస్వంత్ పటేల్, కల్లూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎస్సై

ఉపాధి పనులపై గ్రామసభ

నసురుల్లాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నస్రులాబాద్ మండలకేంద్రంలో సోమవారం ఉపాధిహామీలో జరిగిన పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో ఉపాధి హామీ కూలీలతో కాల్వల పూడిక తీత, చెరువుల పూడికతీత, మొక్కలు నట్టుట, నర్సరీలో మొక్కల పెంపకం, మస్టర్ వెరిఫికేషన్ ఎలా జరిగింది అనే విషయాలపై గ్రామసభలో చర్చించినట్లు సామాజిక తనిఖీ బృంద సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఆర్పీ మౌనిక మాట్లాడుతూ ఈనెల 3న మండల కేంద్రంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రాజేష్, ఏపీవో సౌజన్య, ఉపాధిహామీ సిబ్బంది, కారోబార్ రతన్, సామాజిక తనిఖీ బీఆర్పీలు, ఉపాధిహామీ కూలీలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతపై సాగు భారం

- అకాల వర్షాలతో జిల్లాలో మొదలైన వేసవి దుక్కులు
- రోజురోజుకూ రెట్టింపు అవుతున్న ధరలు
- ఆందోళనలో రైతులు



ఎల్లారెడ్డి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే ప్రధాన జీవన ఆధారమైన జిల్లాలో పంటలపై రోజురోజుకూ సాగు భారం ఎక్కువ అవుతోంది. ఏటా పెరుగుతున్న పెట్రోల్, డీజీల్ ధరలతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో వానాకాలం పంటల సాగుకు భూములు సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వేసవి పనులు జోరుగా సాగుతున్నాయి. డీజీల్ ధరలు విపరీతంగా పెరగడంతో సన్న చిన్న కారు రైతులపై మరింత సాగు భారం పడుతోంది. ఒక్కో గ్రామంలో ఐదు నుంచి పది ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. పెరిగిన ఇంధన ధరలతో పంటల సాగు చేయడం కష్టమవుతుందని అభిప్రాయం వ్యక్తం అవుతున్నాయి. ఏటేటా పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్న దానికి అనుగుణంగా మద్దతు ధరలు పెరగడకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం పెట్రోల్, డీజీల్ ధరలు అధికంగా ఉన్నాయి.

● పెరుగుతున్న అద్దె ధరలు

ఇంధన ధరలకు అనుగుణంగానే ట్రాక్టర్ యజమానులు అద్దె ధరలను పెంచేయడంతో అన్నదాతలపై అదనంగా భారం పడుతోంది. ఏటా గంటకు వంద నుంచి 200 వకు అద్దెలను పెంచుతున్నారు. ఎందుకుంటే డీజిల్ ధరలు పెరగడంతో తమకేమి గిట్టుబాటు కావడం లేదని ట్రాక్టర్ యజమానులు పేర్కొంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేసే విధంగా రైతులు సాగు పనుల్లో యంత్రాలను ఎక్కువ వినియోగిస్తున్నారు. ప్రతీ పనిని యంత్రాల సహాయంతోనే చేపడుతున్నారు. ప్రస్తుతం యంత్రాలతో వేసవి దిక్కులు దున్నడం పనులు చేపడుతున్నారు. వానాకాలం పంటల సాగుకు పంట పొలాలను చదును చేయడం, చెరువులను, కుంటల నల్ల మట్టి సేంద్రీయ ఎరువులను తరలించడం లాంటి పనులు కొనసాగుతున్నాయి. అయితే ఇంధన ధరలు పెరిగాయన్న సాకుతో ట్రాక్టర్ యజమానులు అద్దెలను అమాంతంగా పెంచేస్తున్నారు. గత్యంతరం లేక రైతులు ట్రాక్టర్ యజమానులనే ఆశ్రయించాల్సి వస్తోంది.

● ఏటా రూ. కోట్ల భారం

ఇంధన ధరలు పెరిగిపోవడంతో జిల్లా రైతాంగంపై యేటా కోట్ల రూపాయల భారం పడుతోంది. జిల్లాలో మొత్తం 3,16,560 మంది రైతులు ఉండగా 5,14,290 ఎకరాలలో ప్రతీయేటా వివిధ పంటలను సాగు చేస్తున్నారు. దుక్కి దున్ని అప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయి. గతంలో ఎకరానికి 10 వేల నుంచి 15 వేల వరకు ఖర్చు అయ్యేది. కాని ప్రస్తుతం 20వేల నుంచి 30వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతుందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కూలీల కొరతతో యంత్రాల వినియోగం విపరీతంగా పెరిగిపోతుందన్నారు. దీంతో ఏటా రూ. కోట్ల భారం రైతులపై పడుతోంది.


వేసవి దుక్కులు దున్నుతున్న దృశ్యం

పెట్టుబడి ఖర్చులు పెరిగాయి

● మామిడి కిషన్, లింగారెడ్డిపేట్

పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. డీజిల్ ధరలతో పాటు ఎరువులు విత్తనాలు ధరలు పెరగడంతో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. రైతులు పండించిన ధాన్యానికి ధరలు పెరగడం లేదు. ఒక వైపు వర్షాల భయం మరో వైపు గిట్టుబాటు ధర రాని స్థితి ఉంది.



సాగుకు అందని సాయం!

- వానాకాలం సీజన్ వస్తున్నా జమకాని నిధులు
- చెల్లింపుల్లో తీవ్రజాప్యంపై రైతుల పెదవి విరుపు

మద్నూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేయడానికి ప్రభుత్వం ఎకరానికి రూ.15వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రైతు భరోసా రాలేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్షం రోజుల్లో వానాకాలం సాగుకు రైతులు సమాయత్వం అవుతు న్నారు. అయినా నేటికీ పలువురు రైతులు యాసంగి రైతు భరోసా అందలేదు. ప్రభుత్వం నాలుగు ఎకరాల లోపు రైతులకు మాత్ర మే రైతు భరోసా అందించి మిగతా వారికి ఇవ్వలేదు. ఉమ్మడి మద్నూర్ మండలంలో 22,109 మంది రైతులు రైతు భరోసాకు అర్హులుగా ఉండగా వారిలో 18,640 మంది రైతులకు ప్రభుత్వం నిధులు జమ చేసింది. 3,469 మంది రైతులకు నిధులు జమ కావాల్సి ఉంది. మళ్లీ వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా అర్హులైన రైతులందరికీ పెట్టుబడి సాయం జమ చేయాల్సి ఉంది. రైతు భరోసా అందడంలో ఆలస్యం కావడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇస్తామన్న ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని నాలుగు ఎకరాల వరకే వేసి మిగతా రైతాంగానికి వేయకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బాన్సువాడలో జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న పోచారం


కిష్టయ్య విగ్రహం వద్ద సెల్యూట్ చేసి నివాళ్లు అర్పిస్తున్న ఎస్పీ


నాగిరెడ్డిపేట ..

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

కామారెడ్డిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సకల జనులు పోరాడి తెచ్చుకున్న ప్రత్యేకరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రధానపార్టీ కార్యాలయాలు, పాఠశాలలతో పాటు పలు సంఘనాయకుల కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఆవిష్కరించారు.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి,జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి లు జెండాను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు జాతీయ జెండాను ఆవిష్కరించి అమరులకు నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి,ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవియాదవ్, మాజీ కౌన్సిలర్‌లు నజిరుద్దిన్,హఫీజ్,కృష్ణాజీరావు,గైని శ్రీనివాస్‌గౌడ్,బలవంతరావు,భాను,గెరిగంటి లక్ష్మీనారాయణ, దుబ్బాక ప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పండ్లరాజు,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్,ఐరేని సందీప్,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని అన్నిగ్రామాల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అధికారులు, నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజ్‌గంగారెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీత, పోలీసుస్టేషన్‌లో ఎస్సై ఆంజనేయులు, భిక్కనూరు టీయూ సౌత్‌క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, ఎంఈవో కార్యాలంలో ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం శ్రీనివాస్, ఆయాకార్యాలయాల్లో, పాఠశాలల్లో, గ్రామపంచాయతీలలో, యువజనసంఘాలు, ఆయాపార్టీల ఆధ్వర్యంలో అధికారులు, నాయకులు, విండో కార్యాలయాల వద్ద విండో చైర్మన్లు, ఆయాపార్టీల అధ్యక్షులు జాతీయ పతకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్: తెలంగాణ రాష్ట్ర , బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన తన నివాసం వద్ద , ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ , సబ్‌కలెక్టర్ కిరణ్మాయి , డీఎస్పీ విఠల్‌రెడ్డి , స్థానిక ప్రజాప్రతినిధులు , నాయకులు తదితరులున్నారు.

ఎల్లారెడ్డి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఫామ్ హౌస్‌లో జెండా ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్:మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసిల్దార్ బావయ్య జెండాను ఎగరవేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.. అదేవిధంగా ఆయా శాఖల కార్యాలయల ముందు అధికారులు జెండాను ఎగరవేసి గీతాలపనా చేశారు..ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు,పాల్గొన్నారు.

మాచారెడ్డి: మాచారెడ్డి మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా హంజీనాయక్, బాబు, నారాయణ, మాజీ ఎంపీటీసీ బట్ట రమేష్, మల్లేష్‌యాదవ్, శ్రీశైలం, నాయకులు గోవింద్‌రెడ్డి, గంగారె డ్డి,రాఘవేంద్రరావు, బాలాగౌడ్, నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్,వెంకట్‌రెడ్డి, సుదర్శన్, అజీజ్,తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం లింగంపేట మండలంలో ఘనంగా జరుపుకున్నారు మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ప్రధానోపాధ్యాయులు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నరేష్, పీఏసీఎస్‌లో చైర్మన్ దేవెందర్‌రెడ్డి, లింగంపేట పంచాయతీలో కార్యదర్శి శ్రావణ్ కుమార్, బీజేపీ కార్యాలయంలో క్రాంతికుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద అధ్యక్షుడు నారాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద అధ్యక్షుడు రమేష్, టీడీపీ కార్యాలయం వద్ద అధ్యక్షుడు భీంరావులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాలలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. జెండా పండుగను ఘనంగా జరుపుకున్నారు.

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డి పేట మండలంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద, గ్రామ పంచాయతీల వద్ద, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


జెండా వందనం చేస్తున్న అధికారులు


లింగంపేటలో..

గాంధారి: మండలంలో సోమవారం తెలంగాణ ఆవిర్భావదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రేణుకచౌదరి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓరాజేశ్వర్, సింగిల్‌విండో కార్యాలయంలో చైర్మన్ సాయికుమార్, గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి జెండాలను ఆవిష్కరించారు.వివిధ పార్టీ కార్యాలయాల ఎదుట నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

మహమ్మద్‌నగర్:మహమ్మద్‌నగర్ మండలంలో సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయంలో వద్ద తహసీల్దార్ సవాయిసింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ పండరి,నాయకులు నరసింహులు, లుక్యానాయక్, రమేష్‌గౌడ్,బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు రాజు, ప్రధానకార్యదర్శులు జ్ఞానేశ్వర్, యాదయ్య, ఉపాధ్యాక్షుడు సతీష్, రాజు,కిసాన్ మోర్చా అధ్యక్షుడు పండరి తదితరులు పాల్గొన్నారు.ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బిచ్కుంద: బిచ్కుంద మండలంలో సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి వినీల్‌కుమార్, ఎస్‌ఐ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ గోపాల్, తహసీల్ధార్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎస్పీ రాజేష్‌చంద్ర ఎస్పీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్‌రోడ్డులో గల కానిస్టేబుల్ కిష్టయ్య విగ్ర హం వద్ద నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించాలని ప్రాణత్యాగం చేసి తొలి అమరుడిగా కానిస్టేబుల్ కిష్టయ్య నిలిచారని అన్నారు. అమరుల త్యాగం, ఎందరో మహానుభావుల పోరాటం వల్లే తెలంగాణ సిద్ధించి అభివృద్ధిలో దూసుకుపోతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సంబురాలు అంబరాన్నంటాయి. సోమవారం పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు , ప్రభుత్వ పాఠశాలలు , ప్రైవేటు పాఠశాలల్లో అధికారులు , ఉపాధ్యాయులు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు.

రాజంపేట: తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాజంపేట మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్ధార్ జానకి, ఎంపీడీఓ రఘురాం,మండల అధికారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు..

పెద్ద కొడప్‌గల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో కన్నుల పండుగగా జరిగాయి. తెలంగాణ రాష్ట్రం అవతరణ సందర్భంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో వివిధ కార్యాలయాల వద్ద జెండా ఆవిష్కరణ చేశారు.

రామారెడ్డి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామారెడ్డి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో, తండాల్లో బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, బిజెపి నాయకులు జాతీయ జెండాలను ఎగురవేసి తెలంగాణ గురించి అనుకూలంగా ప్రసంగించారు

నిజాంసాగర్: తెలంగాణ ఆవిర్భావ వేడుకలు సోమవారం నిజాంసాగర్ మండలంలో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయ పాఠశాల ఆవరణలో మువ్వన్నెల జెండా ఎగరవేసి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. . టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల కార్యాలయం ఆవరణలో కూడా టిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బీర్కూర్, జూక్కల్‌లో కూడా ఘనంగా నిర్వహించారు.

తెలంగాణ రైజింగ్ లక్ష్యంతో..

(1వ పేజీ తరువాయి)

జరుగుతుందన్నారు. 45,344 మంది కుటుంబసభ్యులను వారికి సంబంధించిన రేషన్‌కార్డులలో కొత్త పేర్లను జతచేయడం జరిగిందన్నారు. ఈ పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 1,50,131 మంది వినియోగదారులకు 5లక్షల 58 వేల 981 గ్యాస్ సిలిండర్లు పంపిణీచేయడం జరిగిందని తెలిపారు. దీనికి గాను ప్రభుత్వం 16 కోట్ల 05లక్షల సబ్సిడి అందించిందని తెలిపారు. జిల్లాలో అన్ని రకాల పింఛన్‌లు కలిపి 1లక్ష 64 వేలమంది పింఛన్ లబ్దిదారులకు ప్రతినెల రూ.36 కోట్ల 67లక్షల పంపిణీచేయడం జరిగిందని తెలిపారు.మహిళలు పైసా ఖర్చులేకుండా రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైన ఉచితంగా ప్రయాణించే సౌలభ్యం కోసం ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టారని అన్నారు. ఇప్పటివరకు 4 కోట్ల 21 లక్షల 96 వేలమంది ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు.దీని ద్వారా మహిళలకు రూ.137 కోట్ల లబ్ధిచేకురిందని అన్నారు. అన్నిరకాల సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు,కళాశాలల్లో ఇతర సంక్షేమ సంస్థలలో చదువుకొనే విద్యార్థులకు డైట్‌మెనును ప్రకటించడంతో 7063 మంది విద్యార్థులకు లబ్ధి చేకురుతుంది. వీటి నిర్వహణ గురించి 59కోట్ల 99లక్షలు మంజూరుచేశారు. జిల్లాలో జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను 5.30లక్షల ఉచిత పాఠ్యపుస్తకాలు,నోట్ బుక్స్, యూనిఫాం 82,292 మంది విద్యార్థులకు అందజేయనున్నామన్నారు.గృహజ్యోతిలో భాగంగా జిల్లాలోని 1లక్ష 57వేల 656 మంది వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించడం జరుగుతుందని ప్రభుత్వం 5కోట్ల 68లక్షలను ప్రతినెల ఖర్చుచేస్తుందని తెలిపారు. జిల్లాలో 11,153 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 2,894 ఇండ్లనిర్మాణం ప్రారంభించడం జరిగిందని ఇందులో 144 ఇండ్లు బెస్మిట్ లెవల్ వరకు పూర్తిచేయగా సంబంధిత లబ్దిదారులకు రూ.1.09 కోట్ల నిధులు చెల్లించామన్నారు. అదేవిధంగా ప్రస్తుత సంవత్సరంలో 17 వేల 611మంది నిరుపేదలకు రాజీవ్ ఆరోగ్యశ్రీలో భాగంగా శస్త్రచికిత్సలు,చికిత్స గురించి 42 కోట్లు ఖర్చుచేశారని తెలిపారు. ధరణి చట్టంలో లోపాలను సవరిస్తు ప్రభుత్వం భూభారతి చారిత్రాత్మక చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు. మొదట రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జిల్లాలో నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికచేయగా అందులో లింగంపేట మండలంలో 23 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి 4,225 దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించి లింగంపేట మండలంను భూ వివాద రహిత మండలంగా మార్చామన్నారు. నేటి నుంచి అన్ని గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటిలలో అమృత్ 2.0 పథకం కింద 180 కోట్ల రూపాయలతో చేపట్టిన నీటి సరాఫరా పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. జిల్లాను నేరరహిత సమాజంగా మార్చడానికి పోలీసుశాఖ తీసుకుంటున్న చర్యలు ఎంతో అభినందనీయమని అన్నారు. అనంతరం పలు పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్‌లు విక్టర్, చందర్‌నాయక్,డీఎఫ్‌ఓ నిఖిత, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, ఏఎస్పీ చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవిన్యూ సదస్సులు

భిక్కనూరు, జూన్ 02(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలో మంగళవారం నుండి ఈ నెల 20వరకు రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ సునీత సోమవారం తెలిపారు. మొదటిరోజు మంగళవారం లక్ష్మీదేవునిపల్లి, ఇసన్నపల్లి, 4న అంతంపల్లి, మల్లుపల్లి, 5న ర్యాగట్లపల్లి, కంచర్ల, 6న గుర్జకుంట, బాగిర్తిపల్లి, 9,10న జంగంపల్లి,బస్వాపూర్, 11,12న తిప్పాపూర్, కాచాపూర్,13న రామేశ్వర్‌పల్లి, పెద్దమల్లారెడ్డి, 16న భిక్కనూరు, పెద్దమ ల్లారెడ్డి, 17న భిక్కనూరులో ఈ సదస్సులను నిర్వహించడం జరుగుతుందనాన్నారు.

బీర్కూర్:మండలంలో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. జూన్ 3 నుంచి 19వ తేది వరకు ఈ సదస్సులు 13 రెవెన్యూ గ్రామాలలో నిర్వహించనున్నారు. 3వ తేదిన చిన్న అన్నారం, 4న వీరాపూర్, 5న తిమ్మాపూర్, 6న బీర్కూర్, 9న చిన్న దామరంచ, పెద్ద దామరంచ, 10న పోశెట్టిపల్లి, 11న చించోల్లి, 12న కిష్టాపూర్, 13 భైరాపూర్, నాగాపూర్, 16న బరంగేడ్గి, 17న మల్లాపూర్, 18న సంబాపూర్, 19న సుల్తాన్‌పూర్ రెవెన్యూ గ్రామాలలో సదస్సులు జరగనున్నాయి. ఇట్టి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లత కోరారు.

ఎల్లారెడ్డిరూరల్: మండల పరిధిలోని వివిధగ్రామాలలో నిర్వహించే భూభారతి రెవెన్యూ మండల సదస్సు షెడ్యూల్‌ను సోమవారం తహసీల్ధార్ ప్రేమ్ కుమార్ విడుదలచేశారు. ఈనెల 3 నుండి 20 వరకు ఎల్లారెడ్డి మండల వ్యాప్తంగా భూభారతి సద స్సులు నిర్వహిస్తామని తెలిపారు.03 న జాన్కంపల్లి,కుర్దు,కోటాల్ గ్రామాల్లో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.

రాజంపేట:మండలంలో ఈనెల 3 నుంచి 6 వరకు భూభారతి కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్ధార్ జానకి తెలిపారు.మండలంలోని రాజంపేట, ఆర్గొండ, గుండారం, పొందుర్తి, కొండాపూర్, తలమడ్ల, పెద్దాయిపల్లి,సిద్దాపూర్ రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించబడుతాయని తెలిపారు.

జుక్కల్: జుక్కల్ మండలం కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో భూభారతి సదస్సులు నిర్వహిస్తున్నట్లు జుక్కల్ తహసీల్దార్ మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల మూడో తేదీ నుండి తేదీ వరకు భూభారతి సదస్సులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన అన్నారు.

మద్నూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చినటువంటి భూ భారతి చట్టంను నేటి నుంచి నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న సందర్భంగా మద్నూర్ మండలంలోని 23 గ్రామాలలో భూ భారతి రైతు సదస్సులను నిర్వహిస్తున్నట్లు, నేటి నుంచి 20వ తేది వరకు గ్రామాల వారీగా ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మద్నూర్ మండల తహసీల్దార్ ఎం.డి.ముజీబ్ తెలిపారు. దన్నూర్‌లో జూన్ 3వ తేదిన, మద్నూర్ (వాడిఫతేపూర్) 4న, అవలాగావ్‌లో 5న, సుల్తాన్ పేటల్ (హాజీపూర్)లో 6న, మేనూర్‌లో 9న, శేఖాపూర్‌లో 10న, చిన్న షేక్కర్ల 11న, పెద్ద ఎక్లారాలో 12న పెద్ద తడుగూరులో 13న, చిన్న తడుగూరలో 16న సోనాలలో 17న, తడిహిప్పర్గ (మల్లాపూర్)లో 18న ఉంటాయి. అదే విధంగా సోమూర్‌లో 3న, పెద్ద శేఖర్గాలో 4న, కొడ్చిరలో 5న, లచ్చన్‌లో 6న, రూసేగావ్ 9న, చిన్న ఎక్లారాలో 10న హన్దేకల్లూర్ (సలాబత్‌పూర్)లో 11న, రాచూర్‌లో 12న, అంతాపూర్‌లో 13న, ఖరగ్‌లో 16న, గోజేగావ్‌లో 17వ తేదిన సదస్సులు ఉంటాయి.

బిచ్కుంద:రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగంచేసుకోవాలని తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని 29 గ్రామాలలో ఈనెల 20 వరకు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3న చిన్నదాడిగి, 4న శెట్లూర్‌ఖత్‌గావ్, 5 న హస్గుల్, మెక్కా, 6 న బండరెంజల్, గుండెనెమలి, 9న మిషన్‌కల్లాలి, గుండెకల్లురు, 10 న ఫతలాపూర్,కందర్‌పల్లి, 11న రాజుల్ల,గోపన్‌పల్లి, 12 న పెద్దదేవాడ, చిన్నదేవాడ, 13 న పెద్దతక్కడ్‌పల్లి, రాజపూర్, 16న సీతరాంపల్లి, మాన్యపూర్, 17 న సిర్‌సముందర్, మల్కాపూర్, 18న పుల్కల్,బిచ్కుంద, 19న శాంతాపూర్, వాజీద్‌నగర్, 20న దౌత్తపూర్‌లలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

నసురుల్లాబాద్: మండలంలోని ఆయా గ్రామాలలో మూడవ తేదీ నుండి 20వతేదీ వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని గిర్దావర్ వెంకటస్వామి తెలిపారు.. మండల ప్రజలకు ఏమైనా భూ సమస్యలు ఉంటే, రెవెన్యూ సదస్సులతో తమ సమస్యలను పరిష్కారిస్తామని అన్నారు.. ఈ అవకాశాన్ని మండలప్రజలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పర్యాటక,అభివృద్ధి కార్పొరేషన్ కలిసిన నాయకులు



పటేల్ రమేష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

కామారెడ్డిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా కామారెడ్డికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర పర్యటక, అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్‌నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం ఎందరో అమరులయ్యారని తెలంగాణ బిడ్డల ఆత్మహత్యలు చూడలేక, ప్రజల అభిష్టం మేరకు కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని అందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయచైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పండ్లరాజు,గోనె శ్రీనివాస్, గుడుగుల శ్రీనివాస్,ఐరేనిసందీప్ తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యానికి హాజరైనా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు

భిక క్కనూరు, జూన్ 02(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన మాజీ వీడీసీ చైర్మన్ నాగరాజు కుమారుడి వివాహానికి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, నల్లవెల్లి అశోక్, బీఆర్ఎస్ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీటీసీ సాయిరెడ్డి, మాజీ విండో చైర్మన్ నర్సారెడ్డి, మాజీ వైస్ఎంపీపీ ధర్మగల్ల రాజయ్య, వంగేటి దుర్గారెడ్డి, దుర్గారెడ్డి, కమలాకర్, సాయాగౌడ్, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బంజార సమావేశాన్ని విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బంజార నాయకులు

సదాశివనగర్, జూన్ 2(ఆంధ్ర జ్యోతి):సదాశివనగర్ మండల కేంద్రంలోని అశోక కల్యాణ మండ పంలో మంగళవారం ఆల్ ఇండి యా బంజార సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు బాద్యనాయక్ అధ్య క్షతన ఏర్పాటు చేసే బంజారా సమావేశాన్ని విజయవంతం చే యాలని జిల్లా బంజార నాయ కులు సురేందర్ రాథోడ్ పేర్కొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఆల్ ఇండియా బంజార సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ముఖ్యఅతిథిగా హాజరుకావడం జరుగుతుందని, ఈకార్యక్రమానికి జిల్లాలోని అన్నితాండాల బంజార నాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంజార నాయకులు పాల్గొన్నారు.

భిక్కనూరు తహసీల్దార్‌గా సునీత బాధ్యతల స్వీకరణ

భిక్కనూరు, జూన్ 02(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు నూతన తహసీల్దార్‌గా సునీత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు పనిచేసిన తహసీల్దార్ శివప్రసాద్ కామారెడ్డి రెవిన్యూ డివిజన్ ఏవోగా బదిలీ పై వెళ్లగా, డీఏవోగా పనిచేసిన సునీత భిక్కనూరుకు బదిలీపై వచ్చారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీ ల్దార్ రోజ, ఆర్‌ఐ సిబ్బంది పాల్గొన్నారు.

మర్కల్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సదాశివనగర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్కల్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధ్యక్షుడు సంగారెడ్డి, సీనియర్ నాయకులు లింగాగౌడ్ సోమవారంప్రారంభించారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు గ్రామాల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నారని, అందులో బాగంగానే మర్కల్ గ్రామానికి రూ.15 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

సంఘం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థుల ప్రతిభ

నసురుల్లాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలోని సంగం తండా నుంచి జేఈఈ అడ్వాన్స్‌లో ముగ్గురు గిరిజన విద్యార్థులు మెరిశారు. తండా కు చెందిన జరుపుల సుధాకర్ ఎలాంటి కోచింగ్ లేకుండా 177వ ర్యాంకు సాధించాడు. మాలోత్ రవితేజ 509, సెనావత్ శేఖర్ 736 ర్యాంకులు సాధించారు.

నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో ముగ్గురు యువకుల గల్లంతు

- క్రికెట్ ఆడేందుకు వెళ్లిన 12మంది యువకులు
- ఇందులో స్నానం చేసేందుకు వెళ్లి ఈతరాక ముగ్గురు గల్లంతు
- మృతదేహాల కోసం పోలీసులు గాలింపు ● చీకటిగా ఉండటంతో గాలింపు చర్యలకు ఆటంకం

నిజాంసాగర్, ఎల్లారెడ్డిరూరల్,జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో ముగ్గురు యువకులు మధుకర్‌గౌడ్, నవీన్, హర్షలు గల్లంతైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. నిజాంసాగర్, ఎల్లారెడ్డి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బ్యాక్‌వాటర్‌లో గాలింపు చర్యలు చే పడుతున్నారు.ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డి, నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాలకు చెందిన 12మంది యువకులు క్రికెట్ ఆడేందుకు నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ శిఖం భూమి ప్రాంతానికి సోమవారం వెళ్లారు. అక్కడ కొందరు యువకులు క్రికెట్ ఆడుతుండగా మరికొందరు యువకులు స్నానానికై బ్యాక్ వాటర్‌లో దిగారు. దీంట్లో ముగ్గురు యువకులు ఈత రాక నీట మునిగి గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మధుకర్‌గౌడ్, సోమార్‌పేట్ గ్రామానికి చెందిన హర్ష, తిమ్మారెడ్డికి చెందిన నవీన్ ఉన్నారు. దీంతో తోటి స్నేహితులు ఆందోళనకు గురై ఆయాగ్రామస్థులకు తెలిపారు. గ్రామస్థులు ఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఎల్లారెడ్డి, నిజాంసాగర్ పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది, గజ ఈతగాళ్లను రప్పించి గల్లంతైన యువకుల మృతదే హాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే పోలీసులకు సమాచారం తెలిసే సమయానికి పూర్తిగా చీకటి పడటంతో గాలింపు చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. అయినప్పటికీ డే లైట్లు ఏర్పాటు చేసి మృతదేహాలను వెలికితీసేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఘటన స్థలం వద్ద కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.


మధుకర్


నవీన్


హర్ష

పెండింగ్ చలాన్లను చెల్లించాలి

పెద్ద కొడప్‌గల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తమ వాహనాలపై పెండింగ్‌లో ఉన్న చలాన్లను వెంటనే చెల్లించుకోవాలని ఎస్‌ఐ మహేందర్ వాహనదారులకు సూచించారు. సోమవారం పెద్ద కొడప్‌గల్ శివారు పరిధిలో 161వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతు వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని ర కాల పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. దీంతో పాటుగానే వాహనాలకు తమ పిల్లలు మైనర్ అయితే వారికి వాహనాలు ఇవ్వరాదని మైనర్లకు వాహ నాలు ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంటో పాటుగానే వాహనదారులు తమ వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లకు వెంటనే చెల్లించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రమేష్, శ్రీనివాస్, రవి, సృజన, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన ప్రారంభించాలి

బాన్సువాడటౌన్,జూన్2(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన ప్రారంభించాలని మున్సిపల్ అధికారుల లబ్దిదారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని 2వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు వేశారు. ఇండ్లు మంజూరు అయినవారు పనులను ప్రారంభించుకోవాలని , దశల వారిగా బిల్లులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులున్నారు.

పెద్దకొడప్‌గల్:మండలంలోని సముందర్ తాండ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనలబ్ధిదారులు తమఇంటి నిర్మాణాలను ప్రారంభించుకోవాలని పంచాయతీ కార్యదర్శి సుజాత తెలిపారు. గ్రామానికి ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు మంజూరు కాగా వాటి నిర్మాణానికి ముగ్గు వేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతు గ్రామానికి 6 ఇండ్లు మంజూర య్యాయని, వారంతా ఇంటి నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. ఇంటి నిర్మాణాలు చేసుకునేందుకు లబ్దిదా రులు సిద్దపడి పనులు చేసుకోవాలని సూచించారు. నిర్మాణదారులు కొలతల ప్రకారం ఇండ్లు నిర్మాణం చేసుకుంటే బిల్లులు విడతల వారీగా వారి ఖాతాలలో జవవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బన్సీ తదితరులు పాల్గొన్నారు.


ఇంటి నిర్మాణానికి ముగ్గు వేసిన అధికారులు